**Namaaz Roze ke Masaail**
(Telugu)

# ఆరాధనలు


మూలం:
**అబూ సలీమ్ అబ్దుల్ హై**

అనువాదం:
**అబుల్ ఇర్ఫాన్**

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# ఆరాధనా పద్ధతులు

ఇస్లాంలో ప్రత్యేక ఆరాధనలు నాలుగని మీకు ఇంతకు ముందు చెప్పబడింది, (1) నమాజ్ (2) రోజా (3) జకాత్ (4) హజ్. ఇప్పుడీ ఆరాధనలను ఆచరించే విధానాలను తెలుసుకుందాం.

## నమాజ్

మొదట నమాజ్‌ను తీసుకోండి. నమాజ్ చేయటానికి అన్నిటికంటే ముందు శరీరం, బట్టలు పరిశుభ్రంగా ఉండాలి. అంచేత మొదట పరిశుద్ధతను గురించి కొన్ని ముఖ్యవిషయాలు తెలుసుకోండి.

## తహారత్ (శుచీ, శుభ్రత)

తహారత్ అంటే పరిశుభ్రత, పరిశుద్ధత, మాలిన్యాలు తొలగించటం అని అర్థం. మాలిన్యం రెండు విధాలు. ఒకటి కన్పించేది. మలమూత్రాలు, పేడ, రక్తం, చీము వగైరాల్లాంటి మలినాలు. రెండవ రకమైన మాలిన్యం కంటికి కన్పించనిది. అయితే అది కనిపించకపోయినా దాన్ని తొలగించాలని ఆదేశించడమైనది. ఉదాహరణకు వుజూ భంగమవడం, స్నానం చేయవలసిన అవసరం కలగడం. నమాజ్ చేయటానికి ముందు పై రెండు విధాలైన మాలిన్యాల నుండి పరిశుద్ధమవడం అవసరం. దేహం మీదగాని, బట్టలమీద గాని కన్పించే మలినం ఏదైనా అంటుకొని వుంటే దాన్ని కడిగి వేయాలి. వుజూ చేయకపోతే వుజూ చేయాలి. స్నానం అవసరమయితే స్నానంచేయాలి.

## ఇస్తింజా

మల మూత్రాల విసర్జన తర్వాత ఆయా అవయవాలను పరిశుభ్ర పరచటం అవసరం. దీన్ని 'ఇస్తింజా' అంటారు. మొదట ఆ శరీర భాగాన్ని మట్టి పెడ్డతో శుభ్రం చేసి తర్వాత నీళ్ళతో కడిగి పరిశుభ్రం చేసుకోవాలి కేవలం నీటితో పరిశుభ్రపరచుకున్నా సరిపోతుంది.

## వుజూ

నమాజ్ చేయటానికి ముందు ముఖం చేతులూ కడుక్కొని పరిశుభ్రం అవటాన్ని వుజూ అంటారు. వుజూలో నాలుగు విషయాలు ఫర్జ్ (విధి) అయినవి

1) ముఖమంతా కడగటం-నుదుటిపై తల వెంట్రుకల నుంచి గడ్డం క్రిందివరకు, ఒక చెవి నుంచి రెండవ చెవి వరకు.
2) రెండు చేతులను మోచేతులతో పాటు కడగటం.
3) కనీసం తల నాల్గవ భాగాన్ని మసహ్* చేయటం.
4) రెండు కాళ్ళు చీలమండలతో పాటు కడగటం.

ఈ నాల్గింటిలో ఏ ఒక్కటయినా వెంట్రుక మందం తడవక పోయినా వుజూ అవదు.

## వుజూ చేయవలసిన పద్ధతి:

1) మొదట బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ పఠించండి. తర్వాత రెండు చేతులను మణికట్టుల వరకు మూడు సార్లు కడుక్కోండి.
2) మూడు సార్లు పుక్కిలించండి. మిస్వాక్** తో పళ్ళు శుభ్రపరచుకోండి. అది లేకపోతే వ్రేలి తోనే పళ్ళు, నోరు పరిశుభ్రం చేసుకోండి.

---

★ 'మసహ్' అంటే తడి చెయ్యి లేక చేతులతో ఆయా శరీరభాగాన్ని తడపడం అని భావం.

★★ మిస్వాక్ = పలుదోము పుల్ల.

3) మూడుసార్లు ముక్కులో నీళ్ళు పోనిచ్చి శుభ్రంగా చీదండి.

4) మూడుసార్లు ముఖం కడుక్కోండి- ముంగురులు మొదలుకొని గడ్డం క్రిందివరకు, ఒక చెవి నుండి రెండవ చెవివరకు.

5) ముందు రెండు చేతులను మోచేతులతో పాటు తడి చేతులతో రుద్ది, ఆ తర్వాత మూడేసిసార్లు వాటిమీద నీళ్ళుపోసి శుభ్రపరచండి.

6. రెండు చేతులను మరోసారి తడిచేసుకొని అరచేతులకు వ్రేళ్ళకు వున్న తడి వెంట్రుకలకు తగిలేటట్లు ముందువైపునుండి వెనుకదాక తలపై మసహ్ చెయ్యండి. తర్వాత ఆ తడి చేతుల చూపుడు వ్రేళ్ళతో, బొటనవ్రేళ్ళతో, రెండు చెవుల లోపల, వెలుపల శుభ్రం చేసి, అరచేతులు తిరగేసి మెడకు రెండు వైపులా పోనిచ్చి మెడను శుభ్రంచేయండి.

7) రెండు కాళ్ళను చీలమండలతో పాటు మూడు సార్లు కడగండి.

వుజూ చేస్తున్నప్పుడు ప్రతిసారీ మొదట కుడి అవయవాన్ని కడిగి ఆ తర్వాత ఎడమ అవయవాన్ని కడగాలి. వీలైతే కాబా వైపుకు తిరిగి కూర్చోండి. ప్రతి అవయవాన్ని మొదటిసారి శుభ్రపరచిన పిదప బాగారుద్దండి. నీటి చుక్కలు మీద పడకుండా ఉండేందుకు వుజూ కోసం ఎత్తయిన స్థలం మీద కూర్చోండి, వుజూ చేస్తూ మాట్లాడటం మంచిదికాదు. మీ ధ్యాసంతా నమాజ్ వైపుండాలి.★

వుజూ భంగమవడానికి అంటే మనిషికి వుజూ లేకుండా పోవటానికి కాగల కారణాలు క్రింద పేర్కొనబడుతున్నాయి.

1) మలం లేక మూత్రం విసర్జించటం.

---

★ ఎవరైనా తెలిసినవారి సమక్షంలో రెండు మూడుసార్లు వుజూ చేసి చూపించాలి. ఏవయినా పొరపాచ్చలు వుంటే వాటిని దిద్దుకోవడానికి సాధ్యపడుతుంది.

2) అపానవాయువు పోవటం,
3) మలమూత్రాల అంగాలనుంచి మరేదైనా స్రవించడం.
4) శరీరంనుండి రక్తం, చీము రావటం.
5) నోటినిండా వాంతిచేసుకోవటం.
6) పడుకొని లేక దేనికయినా ఆనుకొని నిద్రించటం
7) నమాజ్‌లో పెద్దగా నవ్వటం.
8) ఉమ్ము ఎఱ్ఱగా మారేటంతటి రక్తం నోటి నుండి స్రవించడం.

## స్నానం

స్నానం లేక గుసుల్ చేయటంలో మూడు ఫర్జ్ (విధి) లున్నాయి. వాటిలో ఏ ఒక్కటయినా వెంట్రుకమందం వదిలేసినా లేక పొడిగా వుండిపోయినా స్నానం పూర్తికాదు. మనిషి అపరిశుభ్రంగా వుంటాడు.

1) పుక్కిలించటం.
2) ముక్కులో నీరు పోనిచ్చి చీది శుభ్రం చేయటం.
3) శరీరమంతా నీళ్ళు ప్రవహింపజేయడం, వెంట్రుకల కుదుళ్ళదాక, గోళ్ళ లోపలిదాకా నీళ్ళుపోయడం, స్త్రీలు ఏ కారణం వల్లనైనా జడలేక కొప్పు విప్పలేకపోయినా ఫరవాలేదు. తల వెంట్రుకల కుదుళ్ళకు నీళ్ళు పోనిస్తే చాలు. పురుషులు మాత్రం తల వెంట్రుకల్ని విడదీసి వాటి కుదుళ్ళ వరకు నీళ్ళు పోయేలా శుభ్రపరచడం మాత్రం తప్పనిసరి.

## స్నానం చేసే పద్ధతి:

మొదట రెండు చేతులను మణికట్ల దాకా కడగాలి. తర్వాత శరీరంమీద ఎక్కడెక్కడ మలినం ఉందో అక్కడ శుభ్రంగా కడిగివేయాలి. వుజూలో మాదిరిగా పుక్కిలించాలి, ముక్కులో నీళ్ళుపోనిచ్చి శుభ్రపరచాలి.

తరువాత ఒకసారి శరీరమంతా నీళ్ళుపోసుకొని వెంట్రుకమేర కూడా వదలకుండా వళ్ళు తోముకోవాలి. ఆ తర్వాత ఒంటిమీద బాగా నీళ్ళు పోసుకోవాలి.

ఏ కారణాల వల్ల స్నానం చేయడం వాజిబ్(తప్పనిసరి) అవుతుందో అవి ఇక్కడ తెలియజేయబడుతున్నాయి.*

1) నిద్రలో లేక మెలకువలో వీర్య స్ఖలనం జరగడం, మెలకువలో ఏ కారణం చేతనైనా ఎలాంటి ఉద్రేకం లేకుండా వీర్య స్ఖలనం జరిగితే స్నానం చేయడం వాజిబ్అవుతుంది.
2) సంభోగ క్రియలో కేవలం పురుషాంగం యొక్క ముందు భాగం (శిశ్నం)లోనికి పోయినా స్త్రీ పురుషులిద్దరూ స్నానం చేయడం వాజిబ్ (అవసరం) అవుతుంది.
3) ఋతుస్రావం, పురిటిరక్తం ఆగిపోగానే స్త్రీ స్నానం చేయటం వాజిబ్ అవుతుంది.

## నీరు

కొన్ని రకాలనీళ్ళు శుచి శుభ్రత కోసం వినియోగించవచ్చు, వాటితో బట్టలుతకవచ్చు, స్నానం చేయవచ్చు, వుజూ చేయవచ్చు. ఉదా. (1)వర్షపు నీరు (2) చెలమ నీరు (3) బావి నీరు (4) నది నీరు (5) సముద్రపు నీరు (6) కరిగిన మంచు లేక వడగళ్ళ నీరు. (7) చెరువు లేక కోనేటి నీరు. అది కనీసం ముప్పయి చదరపు గజాల విస్తీర్ణం, జానెడు కన్నా యెక్కువ లోతు గలదిగా ఉండాలి.

ఎలాంటి నీళ్ళయితే ఉతకటానికి, కడగటానికి, పరిశుభ్రం చేయటానికి, వుజూ చేయటానికి, స్నానం చేయటానికి పనికిరావో అలాంటి వాటిని దిగువన పేర్కొంటున్నాముః

---

★ మీరు ఇష్టంవచ్చినప్పుడు స్నానం చెయ్యడంలో తప్పులేదు కాని స్నానం చెయ్యడం 'వాజిబ్' అయినప్పుడు స్నానం చెయ్యకుండా నమాజ్ చెయ్యడానికి, దివ్యఖుర్ఆన్ పఠించడానికి, దాన్ని ముట్టుకోడానికి అనుమతిలేదు.

1) ఏదయినా కాయను, చెట్టును పిండి తీసిన రసం లేక మందులు, ఇతర వస్తువులు కాచి తీసిన సారం.

2) ఏదయినా పరిశుద్ధమయిన వస్తువు కలసిపోవటం వల్ల రంగు, రుచి వాసన మారిపోయి, చిక్కగా మారిన నీరు. నీరుచిక్కగా మారకపోతే ఆ నీటినివాడవచ్చు. ఉదాహరణకు నదుల్లో ప్రవహించే మట్టిగలసిన నీరు, ఎట్టి మందు కలపబడిన బావి నీరు, మొగలి, రోజా లాంటి పన్నీరు కలిపిన నీరు.

3) అపరిశుద్ధ వస్తువు పడిన లేక ఏదైనా జంతువు పడి చచ్చిపోయినా కొద్దిపాటి నీరు. ప్రవహించని నీటిని, పెద్ద చెరువు లేక పెద్ద కోనేటికంటే తక్కువగా ఉన్న నీటిని కొద్దిపాటి నీరు అంటారు. ఉదాహరణకు బావి, చిన్న ట్యాంకి, గాబు లేక కుండ నీళ్ళు. ఇలాంటి నీళ్ళలో కొంత పేడ, మూత్రం లేక ఇతర అపరిశుద్ధ వస్తువులు పడితే అవి అపరిశుద్ధమవుతాయి.

4) పారే నీళ్ళను పెద్ద చెరువు లేక పెద్ద కోనేటి నీళ్ళను చాలా నీరు అంటారు. ఇలాంటి నీళ్ళలో ఏదైనా అపరిశుద్ధ వస్తువు కలసిపోయి దాని ప్రభావం కనపడి నీటి రంగు లేక రుచి మారినా లేక వాసన వచ్చినా ఆ నీళ్లు కూడా అపరిశుద్ధమయినవిగా పరిగణించబడతాయి.

5) ఒకసారి వాడిన నీరు కూడా తిరిగి పరిశుద్ధపరచటానికి వుపయోగపడదు. ఉదాహరణకు వుజూ చెయ్యగా పారిన నీరు, లేక స్నానం చేయగా పారిన నీరు. దీన్ని తిరిగి వినియోగించరాదు.

6. ఏ జంతువుల మాంసం హరామో (నిషేధమో) దాని ఎంగిలి నీరు కూడా అపరిశుద్ధమైందే.* ఉదాహరణకుః– పంది, కుక్క, తోడేలు, సింహం మున్నగు జంతువుల ఎంగిలి నీళ్ళు. పిల్లి ఎలుకనుతిన్న

★ ధర్మయుక్తమైన జంతువుల ఎంగిలి నీరు పరిశుద్ధమైనదే.

వెంటనే నీటిని ఎంగిలి చేస్తే అవి కూడా అపరిశుభ్రమైనవే. అలాగే సారాయి త్రాగిన వ్యక్తి ఆ వెంటనే నీళ్ళు తాగితే, అతని ఎంగిలి నీరు కూడా అపరిశుద్ధమవుతాయి. అయితే సాధారణంగా ఏ మానవుని ఎంగిలి అపరిశుద్ధం కాదు. అతను ముస్లిం అయినా, ముస్లిమేతరుడు అయినా, అంటరాని వాడనబడే వాడయినా.

7. పిల్లి ఎంగిలి చెయ్యక పూర్వమే ఎలుకను తినకుండా ఉన్నట్లయితే దాని ఎంగిలి, కోడి ఎంగిలి నీళ్ళు మలినాలను తినే ఆవు, గేదెల ఎంగిలి నీళ్ళు, కాకి లేక గద్ద ఎంగిలి చేసిన నీళ్ళు అపరిశుద్ధమయినవైతే కావు కాని, అనివార్య పరిస్థితుల్లో తప్ప అలాంటి నీళ్ళు వాడటం శ్రేయస్కరం కాదు.

8. కొద్దిపాటి నీటిలో శరీరంలో రక్త ప్రసరణ కలిగిన ఏ జంతువు పడి చనిపోయినా ఆ నీరు కూడా అపరిశుద్ధమవుతాయి. ఉదాహరణకు పిచ్చుక, కోడి, పిల్లి, ఎలుక వగైరా. ముప్పయి చదరపు గజాల వైశాల్యానికి తక్కువగా ఉన్న కోనేరు, చిన్న చెరువు, బావి, ట్యాంకి, గాబు లేక కుండ మొదలైన వాటి నీటిని కొద్దిపాటి నీరు అంటారు. చేప, కప్ప వగైరా నీటి జంతువులు నీళ్ళలో చనిపోతే ఆ నీరు అపరిశుద్ధం కావు. అట్లాగే చీమ, దోమ, ఈగ నీటిలో పడిచస్తే ఆ నీళ్ళు కూడా అపరిశుద్ధం కావు.

కొద్దిపాటి నీరు అపరిశుద్ధమయితే వాటిని శరీర అవయవాలు పరిశుభ్రపరచు కోవటానికి, బట్టలుతకటానికి, వుజూ స్నానం చేయటానికి ఉపయోగించరాదు. ఇలాంటి నీటిని పరిశుద్ధపరచటమూ సాధ్యపడదు. కాని బావి నీరు అపరిశుద్ధమైతే వాటిని పరిశుద్ధపరచు కోవచ్చు. ఆ పద్ధతి ముందు వస్తుంది.

## బావి నీరు ఎలా అపరిశుద్ధమవుతాయి

ఈ క్రింది కారణాల వల్ల బావి నీరు అపరిశుద్ధమవుతాయి:-

1) మూత్రం, పేడ లేక అలాంటివే ఇతర అపరిశుద్ధ వస్తువు ఏదైనా పడితే
2) ఏ జంతువుల ఎంగిలి అపరిశుద్ధమయినదో అలాంటి జంతువు, ఉదాహరణకు, పంది, కుక్క, తోడేలు, సింహం ఇత్యాదివి పడిపోతే- అది ప్రాణంతో బయటికి వచ్చినా సరే.
3) శరీరంలోని రక్తప్రసరణ కలిగిన ఏ ప్రాణి అయినా పడి చచ్చిపోయినా లేక చచ్చి పడిపోయినా ఉదాహరణకు బల్లి, పిల్లి, ఎలుక, మేక మున్నగు జంతువులు.
4) వంటి మీద మలినం లేక అపరిశుద్ధ పదార్థం ఏదైనా అంటుకొని ఉన్న జంతువు పడిపోయినా లేక అది బావిలో పడి మల మూత్ర విసర్జన చేసినా అది ప్రాణంతో బయటపడినా సరే.

## బావి నీటిని పరిశుద్ధపరిచే విధానం

అ) ఈ క్రింద పేర్కొనబడిన విషయాలలో ఏదైనా సంభవిస్తే బావిలో ఉన్న నీరంతా తోడేయాలి. ఒకవేళ బావి మరీ పెద్దదయితే, ఎంత తోడినా ఆగని ఊట ఉన్నట్లయితే అందులో నుండి రెండొందల నుండి మూడొందల బకెట్లు* దాకా నీరు తోడి పారబోయాలి.

1) బావిలో మలమూత్రాలు లేక పేడ వంటి అపరిశుద్ధ పదార్థాలు పడిపోతే లేక అపరిశుద్ధ పదార్థాలు దేహానికి అంటుకొనివున్న ప్రాణి ఏదైనా పడితే,
2) మనిషి పడిపోయి చనిపోతే
3) పంది, కుక్క, తోడేలు, సింహం వగైరా ఏదైనా జంతువులు పడి బ్రతికి బయట పడినా లేక చచ్చిపోయిన తరువాత తీసేసినా....

---

★ బకెట్లంటే ఇక్కడ ఆ బావిలో నీళ్ళు తోడడానికి వినియోగించే బుంగ, బొక్కెన మరే సాధనమయినా కావచ్చు. అంతకంటే పెద్దదో చిన్నదో అవసరంలేదు.

4) మేక, మేక అంతటివి లేక అంతకంటే పెద్ద "హలాల్" జంతువులు పడిపోయి చస్తే లేక చిన్న చిన్న జంతువులు ఒకటికి మించి పడి చచ్చినా - ఉదాహరణకు రెండు పిల్లులు వగైరా.

5) రక్తప్రసరణ గల ఏదైనా చిన్న ప్రాణి పడి చచ్చిపోయి ఉబ్బితే లేక చిట్లిపోతే (ఉదా. ఎలుక, బల్లి మొదలైనవి).

(అ) పిల్లి, కోడి, పావురాయి లేక వాటంతటి ప్రాణి ఏదైనా పడి చచ్చిపోయిన తర్వాత, ఉబ్బి చిట్లి పోకముందే దాన్ని బయటికి తీస్తే, అప్పుడు నలభై నుండి అరవై బకెట్ల నీరు తీసేస్తే బావి నీళ్ళు పరిశుద్ధమవుతాయి.

(ఇ) బల్లి, ఎలుక, పిచ్చుక లేక వాటంతటి ప్రాణి ఏదైనా పడి చచ్చిపోయిన తర్వాత ఉబ్బి చిట్లిపోక ముందే దాన్ని బయటికి తీసి, ఇరవై నుండి ముప్పై బకెట్ల నీళ్ళు తోడి పారేస్తే ఆ బావి నీళ్ళు పరిశుద్ధమవుతాయి.

## తయమ్ముం

ఒక్కోసారి నీళ్ళే దొరకవు. ఒక్కోసారి మనిషి వ్యాధిగ్రస్తుడై నీళ్ళతో వుజూ లేక స్నానం చేస్తే వ్యాధి అధికమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్నానం, వుజూ చేయటానికి బదులు తయమ్ముం చేసుకునేందుకు అనుమతి ఉంది. తయమ్ముం చేసే విధానం ఇదిః-

పరిశుద్ధమయ్యే సంకల్పంతో మొదట రెండు చేతులను పరిశుభ్రమయిన మట్టిపైన తట్టాలి. ఆ చేతులతో ముఖమంతా స్పర్శించాలి. అలా స్పర్శించేటప్పుడు వెంట్రుక మందం కూడా వదలకుండా స్పర్శించాలి. మళ్ళీ రెండవసారి మట్టిపైన చేతులు తట్టి చేతి వ్రేళ్ళ నుండి మోచేతుల వరకు వెంట్రుక మందం కూడ వదలకుండా స్పర్శించాలి. ఇదే "తయమ్ముం" అంటే. స్నానం చేయవలసివచ్చినా, వుజూ చేయవలసి వచ్చినా రెండు పరిస్థితుల్లో కూడా ఇదే విధంగా తయమ్ముం చేసి మనిషి పరిశుద్ధమవుతాడు. ఇప్పుడతను నమాజ్ చేయవచ్చు.

తయమ్ముం చేయటానికి ఉపయోగించదగిన పదార్థాలు:-పరిశుభ్రమైన మట్టి, ఇసుక, రాయి, సున్నం, మట్టిపాత్రలు, ఇటుకలు, రాతి లేక ఇటుకగోడ, దుమ్ముపడిన బట్టలు లేక కలప మొదలయినవి.

తయమ్ముం చేయటానికి సరయిన కారణాలు కాగల పరిస్థితులు:-

1) నీళ్ళు కనీసం ఒక మైలు దూరంలో ఉన్నప్పుడు.

2) నీళ్ళు సోకడం వలన వ్యాధి అధికమయ్యే ప్రమాదం వున్నప్పుడు.

3) నీళ్ళదగ్గర అపాయకరమైనది ఏదైనా వున్నప్పుడు. ఉదాహరణకు శత్రువు లేక నష్టపరిచే ప్రాణి ఏదైనా వున్నప్పుడు.

4) బావిలో నుంచి నీళ్ల తోడటానికి ఏ సాధనమూ లేనప్పుడు.

5 నీళ్లు తాను తీసుకోలేని లేక అందించే వారు కూడా లేని క్లిష్టపరిస్థితి ఎదురయినప్పుడు.

ఏ కారణాల వల్ల వుజూ భంగమైపోతుందో ఆ కారణాల వల్లనే తయమ్ముం కూడా భంగమైపోతుంది. ఇంకా, నీళ్ళు లభించినప్పుడు లేదా అనివార్య పరిస్థితి తొలగిపోయినపుడు కూడా తయమ్ముం భంగమై పోతుంది.

## నమాజ్ చేసే విధానం★

మొదట మీకిక్కడ రెండు రకాతుల నమాజ్ చేసే విధానం తెలుపుతున్నాం. వుజూ చేసిన తర్వాత కాబా ★★ దిశకు తిరిగి నిలబడండి.

ఏ దిశ వైపుకయితే తిరిగి నమాజ్ చేస్తామో ఆ దిక్కును "ఖిబ్లా" అనంటారు.

---

★ నమాజ్ చేసే విధానం ఎవరయిన తెలిసిన వారి ద్వారా కూడా నేర్చుకోవాలి. అలాగే నమాజ్‌లో పఠించే స్మరణలు, వచనాలు తెలిసిన వారికి వినిపించి సరిచేసుకోవాలి. కేవలం వ్రాసి వున్న దాన్ని చూసి కంఠస్తం చేయటం వల్ల ఏదైనా మాట తప్పుగా నేర్చుకునే ప్రమాదముంది.

★★ కాబా గురించి మీరు హజ్ వివరణలో చదివి ఉన్నారు.

అన్నిటికంటే ముందు అల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు) అంటూ రెండు చేతులను చెవులవరకు ఎత్తి నాభికింద కట్టు కోండి. చేతులు ఎత్తేటప్పుడు వ్రేళ్ళను పూర్తిగా చాపి అరచేతులు ఖిబ్లా వైపుకు వుండేటట్లు చూడండి. చేతులు కట్టుకునేటప్పుడు ఎడమచేతిని క్రింద వుంచి దాని మణికట్టును కుడిచేతి బొటన వ్రేలు మరియు చిటికన వ్రేలితో పట్టుకొని మిగిలిన మూడు వ్రేళ్ళు ముంజేతిపై చాచి వుంచండి. నిలబడి అటూ ఇటూ దిక్కులు చూడకూడదు. మీ దృష్టి అంతా సజ్దా చేసే చోట నిలపాలి. ఇప్పుడు పఠించండి.★

*"సుబ్హాన కల్లాహుమ్మ వ బిహమ్దిక వ తబారకస్ముక వ*

*తఆలా జద్దుక వ లా ఇలాహ గైరుక్"*

అల్లాహ్! నీవు పరమ పవిత్రుడవు. స్తోత్రములు నీకే. నీ పేరు శుభప్రదమయింది. నీ గొప్పతనం అత్యున్నతమయింది. నీవు తప్ప ఆరాధింప తగినవాడెవడూ లేడు.

ఆ తర్వాత ఇలా చదవండి:-

*"అవుజు బిల్లాహి మిన షైతా నిర్రజీమ్"*

శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుండి రక్షణ పొందుటకై అల్లాహ్ శరణు కోరుతున్నాను,

*"బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్"*

కరుణించేవాడు, కనికరించేవాడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

ఇప్పుడు ఫాతిహా సూరాను పఠించండి:-

---

★ కేవలం అరబ్బీ పదాలనే పఠించాలి. నమాజ్‌లో పఠించేదంతా మీరు అర్థం చేసుకునేందుకు తెలుగులో వాటి భావం వ్రాయబడింది.

**"అల్‌హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. అర్రహ్‌మా నిర్రహీమ్. మాలికి యౌమిద్దీన్. ఇయ్యాక నాబుదు వ ఇయ్యాక నస్తయీన్. ఇహ్‌ది నస్సిరాతల్ ముస్తఖీమ్. సిరాతల్లజీన అన్ అమ్‌త అలైహిమ్ గైరిల్ మగ్‌జూబి అలైహిమ్ వ లజ్జాల్లీన్"... (ఆమీన్)**

స్తోత్రములు అల్లాహ్ కొరకే. ఆయన సకలలోకాల ప్రభువు, అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు, తీర్పు దినపు యజమాని.★ మేము నిన్నే ఆరాధిస్తాము, సహాయం కొరకు నిన్నే అర్థిస్తున్నాము. మాకు ఋజు మార్గం చూపించు – ఎవరిపై నీవు నీ కానుకలు కురిపించావో, ఎవరయితే నీ ఆగ్రహానికి గురికాలేదో, ఎవరయితే మార్గభ్రష్టులు కాలేదో వారి మార్గం.

దీని తర్వాత ఖుర్‌ఆన్‌లోని ఏదైనా చిన్న సూరా గాని, లేక పెద్ద సూరా యొక్క ఏదైనా ఒక భాగం గాని పఠించండి. ఇక్కడ రెండు చిన్న సూరాలు వ్రాస్తున్నాము. వీటి నైతే కంఠస్తం చేసుకోండి. తర్వాత మరికొన్ని సూరాలు ఎవరయినా తెలిసిన వారి సహాయంతో కంఠస్తం చేసుకోండి.

**"ఖుల్ హు వల్లాహు అహద్, అల్లాహుస్సమద్, లమ్ యలిద్ వలమ్ యూలద్ వలమ్ య కుల్లహు కుఫువన్ అహద్".**

ప్రవక్తా! వారితో చెప్పండి. అల్లాహ్ అయితే ఒక్కడే. ఆయన సకల ఆపేక్షలకు అతీతుడు. ఆయన ఎవరికీ తండ్రి కాడు. ఆయన ఎవరికీ సంతానమూ కాదు. ఆయనకు సరిసమానమయిన వారు ఎవరూ లేరు.

**"వల్ అస్ర్, ఇన్నల్ ఇన్‌సాన లఫీ ఖుస్ర్. ఇల్లల్లజీన ఆమనూ వ అమిలుస్సాలిహాతి వ తవాసౌ బిల్ హఖ్ఖి వ తవాసౌ బిస్సబ్ర్"**

---

★ అంటే ప్రళయ దినం. ఆ రోజు ప్రతి వ్యక్తి చేసిన పనుల లెక్కలు చూపబడతాయి. పూర్తిగా న్యాయం చేకూర్చి ప్రతి ఒక్కరికి దానికి బదులు ఇవ్వటం జరుగుతుంది.

కాలం సాక్షిగా, మనిషి నిస్సందేహంగా నష్టంలో ఉన్నాడు (కాని)- ఎవరయితే విశ్వసించారో, సత్కార్యాలు★ ఆచరించారో, సత్యాన్ని ఉద్బోధించారో, ఇంకా, సహనం కొరకు ఉపదేశించారో వారు తప్ప.

ఇప్పుడు అల్లాహు అక్బర్ అంటూ వంగండి. ఇలా వంగటాన్ని 'రుకూ' అంటారు. రుకూలో రెండు చేతుల్ని రెండు మోకాళ్ళపై ఆనించి పట్టుకోండి. కాళ్ళు నిటారుగా నిలబెట్టి నడుం భూమికి సమాంతరంగా ఉండేటట్లు వంగండి. దృష్టి పాదాల మీద ఉంచండి. ఇప్పుడు ఈ క్రింది సూక్తి కనీసం మూడుసార్లు పఠించండి.

**సుబ్హాన రబ్బియల్ అజీమ్.**

పరమ పవిత్రుడు, మహోజ్వలుడయిన నా ప్రభువు.

తర్వాత:-

**సమి అల్లాహు లిమన్ హమిదహ్.**

స్తుతించిన వాని స్తుతిని అల్లాహ్ విన్నాడు

అని అంటూ నిలబడండి. నిలబడి చేతులు కట్టుకోకుండానే....

**రబ్బనా లకల్ హమ్ద్.**

ఓ నా ప్రభూ! స్తోత్రములన్నీ నీకే

అని పలకండి.

ఇప్పుడు 'అల్లాహు అక్బర్' అంటూ సజ్దా చెయ్యండి. సజ్దా చేయడంలో మొదట మోకాళ్ళు నేలమీద మోపి తర్వాత రెండు చేతుల్ని, ఆ తరువాత ముక్కు, నుదిటిని నేలపై మోపాలి. సజ్దాలో శరీర వెనుక భాగం పైకెత్తి తొడలు కడుపుకు తగలకుండా ఉంచాలి. మోచేతులు క్రింద ఆనకుండా ఉంచాలి. చేతి వ్రేళ్ళు కలిపివుంచి, ఖిబ్లావైపుకు మళ్ళించి ఉంచాలి. రెండు

---

★ దైవాదేశాల కనుగుణంగా దైవ ప్రసన్నత కోరి చేసే పనులే సత్కార్యాలు.

చేతులను చెవుల క్రింద వచ్చేలా పెట్టాలి. కాలివ్రేళ్ళు ఖిబ్లా వైపునకు మళ్ళించి, నేలకు ఆనించి ఉంచాలి. సజ్దాలో కనీసం మూడు సార్లు - సుబ్‌హాన రబ్బియల్ ఆలా (పరమ పవిత్రుడు, మహోన్నతుడయిన నా ప్రభువు) అని స్మరించాలి.

ఇక 'అల్లాహు అక్బర్' అంటూ సజ్దా నుండి లేచి కూర్చోండి. ఈ కూర్చోవడంలో ఎడమకాలు కుడి వైపుకు మడచి దాని మీద కూర్చొని కుడి కాలును సజ్దా స్థితిలో మాదిరిగానే వ్రేళ్ళు ఖిబ్లా వైపుకు మళ్ళించి పెట్టాలి. రెండు చేతులను రెండు తొడలపై మోకాళ్ళకు చేరువుగా పెట్టుకోవాలి. చేతివ్రేళ్ళు చాచి కొనలు ఖిబ్లా వైపుకు మళ్లించివుంచండి, సరిగా కూర్చున్న తర్వాత మళ్ళీ 'అల్లాహు అక్బర్' అంటూ సజ్దాలోకి పోండి. మొదటి సజ్దాలో స్మరించినవే ఇప్పుడు కూడా స్మరించండి. ఆ తర్వాత "అల్లాహు అక్బర్' అంటూ సజ్దా నుండి పైకి లేచి నిటారుగా నిలబడాలి. నిలబడి చేతులు యధాలాపంగా కట్టుకోవాలి. ఇప్పుడు మొదట "బిస్మిల్లా హిర్రహ్‌మాఁ నిర్రహీమ్" తర్వాత మొదటి రకాతుల్లో పఠించిన విధంగా ఫాతిహా సూరా, తర్వాత ఖుర్‌ఆన్‌లోని ఏదైనా ఇతర సూరా పఠించండి. తర్వాత ఇది వరకటి లాగానే రుకూ చేయండి. రుకూ నుంచి నిటారుగా నిలబడండి. తర్వాత సజ్దా చేయండి. మొదటి రకాతులో మాదిరిగానే ఇప్పుడు కూడా రెండు సజ్దాలు చేయండి. కాని ఇప్పుడు రెండు సజ్దాలు అయినాక నిలబడ టానికి బదులుగా రెండు సజ్దాల మధ్య ఎలా కూర్చున్నారో అలా కూర్చోండి. దీన్నే 'ఖాయిదా' అంటారు. ఖాయిదాలో కూర్చొని "తషహ్హుద్" పఠించాలి.

**"అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వ రహ్మతుల్లాహి వ బరకాతుహూ. అస్సలాము అలైనా వ అలా ఇబాదిల్లాహి స్సాలిహీన్, అష్‌హదు**

**అన్ ల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్"**

వాక్సంబంధమైన, శరీర సంబంధమైన, ధనసంబంధమైన సమస్త ఆరాధనలు అల్లాహ్ కొరకే, ఓ ప్రవక్తా మీపై శాంతినెలకొనుగాక, దైవకారుణ్యం, శుభములు కలుగుగాక.

మా మీద సజ్జనులయిన దైవ దాసుల మీద (కూడా) శాంతి కలుగుగాక, అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ (సఅసం) ఆయన దాసులని, ఆయన ప్రవక్త అని (కూడా) నేను సాక్ష్యమిస్తున్నాను.

తర్వాత కూర్చొని ఉండే ఈ క్రింది దరూద్ పఠించండి:

**"అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ్వ అలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లయిత అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదు మ్మజీద్ అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వ్వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్తా అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదు మ్మజీద్"**

"అల్లాహ్! నీవు (హజ్రత్) ఇబ్రాహీం (అస), ఆయన సహచరులపై ఎలా కారుణ్యం కురిపించావో అలాగే (హజ్రత్) ముహమ్మద్ (సఅసం), ఆయన సహచరులపై కారుణ్యం కురిపించు. నిస్సందేహంగా నీవే స్తుతింపదగిన వాడవు మరియు గొప్ప మహత్తు కలవాడవు. అల్లాహ్! నీవు (హజ్రత్) ఇబ్రాహీం (అస)కు, ఆయన అనుచరులకు ఎలా శుభాలు ప్రసాదించావో అలా (హజ్రత్) ముహమ్మద్ (సఅసం)కు, ఆయన అనుచరులకూ్కడ శుభాలను ప్రసాదించు. నిస్సందేహంగా నీవే స్తుతింపదగిన వాడవు మరియు గొప్ప మహత్తు గలవాడవు."

ఆ తర్వాత ఒక దువా పఠించండి. క్రింద ఒక దువా ఉదాహరిస్తున్నాముః

**"రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతన్ వ ఫిల్ ఆఖిరతి హసనతన్ వ ఖినా అజాబన్నార్"**

"ప్రభూ! మాకు ఇహలోకంలో కూడా మంచిని ప్రసాదించు, పరలోకంలో కూడా మంచిని ప్రసాదించు. మరియు మమ్మల్ని నరకాగ్ని నుంచి రక్షించు."

ఆ తర్వాత ముందు కుడివైపుకు పిదప ఎడమ వైపుకు తిరిగి **"అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్"** (మీపై శాంతి, దైవానుగ్రహాలు కలుగుగాక!) అని పలుకుతూ నమాజ్‌ని పూర్తిచేయాలి.

ఈ విధంగా రెండు రకాతులు పూర్తి అయ్యాయి. ఒక్కోసారి ఏకంగా మూడు లేక నాలుగు రకాతులు కూడా చెయ్యవలసి వస్తుంది. అప్పుడు రెండవ రకాతు తర్వాత ఖాయిదాలో తషహ్హుద్ తర్వాత దరూద్ చదవకుండానే అల్లాహు అక్బర్ అంటూ పైకిలేచి నిలబడాలి. పిదప చేతులు కట్టుకొని మొదటి రెండు రకాతుల్లో పఠించినట్లే బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం చెప్పి ఫాతిహా సూరా దాంతోపాటు ఖుర్‌ఆన్‌లోని మరో సూరా పఠించాలి.

ఆరాధనలను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవటానికి ముందు కొన్ని పారిభాషిక పదాల అర్థాలు తెలుసుకుని వాటిని జ్ఞాపకం ఉంచుకోవటం చాలా ముఖ్యం. ఈ క్రింది పారిభాషిక పదాలు గమనించండి.

**ఫర్జ్—**

ఖుర్‌ఆన్ లేక హదీస్ ద్వారా తప్పని సరిగా చేయాలని నిర్ధారించబడిన దాన్ని 'ఫర్జ్' అంటారు. ఎవరయినా ఏదయినా ఫర్జ్‌ను నిరాకరిస్తే అతను ఇస్లాం పరిధికి దూరమయిపోతాడు. ఫర్జ్‌ను వదలిపెట్టినవాడు ఘోరపాపం చేసిన వాడవుతాడు. తీర్పుదినాన అతనికి దేవుడు ఘోరశిక్ష విధిస్తాడు. ఫర్జ్

ఎలాంటి పరిస్థితుల్లోనయితే వదలటానికి అనుమతించబడిందో అలాంటి పరిస్థితుల్లోనే దాన్ని వదలటానికి వీలుంటుంది. ఉదాహరణకు అపస్మారక స్థితిలో నమాజ్; ప్రయాణం(48 మైళ్ళకు మించిన దూర ప్రయాణం)లో, వ్యాధిలో రోజా (ఉపవాసం) వదలడానికి అనుమతి ఉంది.

**సున్నత్:-**

దైవ ప్రవక్త(సఅసం) ఆచరించిన దాన్ని లేక ఆయన ఆచరించమని ఆదేశించిన దాన్ని 'సున్నత్' అంటారు. ఇది రెండు విధాలు.

**సున్నతె ముఅక్కదః-**

అంటే దైవ ప్రవక్త (సఅసం) నిత్యమూ చేసిన పని లేక చేయమని నిర్ద్వంద్వంగా ఆదేశించిన పని. క్లిష్టపరిస్థితుల్లో తప్ప ఇలాంటి పని సాధారణంగా వదలటం మంచిదికాదు.

**సున్నతె గైర్ ముఅక్కదః-**

అంటే దైవప్రవక్త (సఅసం) అప్పుడప్పుడు వదలివేసిన పనులు. ఇలాంటి వాటిని ఎప్పుడయినా వదలిపెట్టటంలో ఎలాంటి తప్పులేదు.

**నఫిల్:-**

కొన్ని పనులు ఆచరించటం అంత ముఖ్యం కానప్పటికి షరీయత్ (ధర్మ శాస్త్రం) వాటిని ఆచరించటం మంచిదని తెల్పుతోంది. ఇలాంటి పనులు ఆచరిస్తే పుణ్యం లభిస్తుంది. కాని వాటిని విడనాడటం వల్ల శిక్ష మాత్రం పడదు.

## నమాజ్ వేళలు

రోజుకు ఐదు సార్లు నమాజ్ చేయటం విధి - ఫర్జ్. ఆ వేళలు 1) ఫజ్ర్ 2) జుహర్ 3) అస్ర్ 4) మగ్రిబ్ 5) ఇషా.

ఫజ్ర్ సమయం ఉషోదయాన మొదలయి అరుణోదయం వరకు వుంటుంది.

జుహర్ వేళ సూర్యుడు పడమటి దిశన వాలినప్పటి నుంచి ఒక వస్తువు నీడ ఆ వస్తువు పొడవుకు రెట్టింపు అయ్యే వరకు ఉంటుంది. దాన్ని గుర్తించటం ఎలాగో ముందు తెలుపడం జరిగింది.

అస్ర్ వేళ జుహర్ వేళ అంతం కాగానే ప్రారంభమయి సూర్యాస్త మయానికి పూర్వం వరకు ఉంటుంది.

మగ్రిబ్ వేళ సూర్యాస్తమయం తర్వాత మొదలై ఆకాశంలో అరుణ రేఖలు ఉన్నంతవరకూ ఉంటుంది.

ఇషా వేళ ఆకాశంలో అరుణరేఖలు అస్తమించినప్పటి నుంచి ప్రారంభమయి ఫజ్ర్ వేళ ప్రారంభమయ్యే వరకు ఉంటుంది.

## నీడను గుర్తించే పద్ధతి

చదును ప్రదేశంలో ఓ కర్ర పాతండి. ఉదయాన సూర్యుడు పైకివచ్చే కొలది కర్ర నీడ పొడుగు తగ్గుతూ పోతుంది, తర్వాత ఆ నీడ తూర్పుకు వాలి మళ్ళీ పెరగటం మొదలెట్టగానే సూర్యుడు వాలుతున్నాడని తెలుస్తుంది. అప్పుడు దాని నీడ కొలవండి, అది ఆ కర్రకు సమంగా ఉంటే దీన్ని అసలు నీడ అంటారు. అప్పుడు జుహర్ వేళ ఆరంభమవుతుంది. ఆ తరువాత దాని నీడ కర్ర నిడివి కంటే రెట్టింపు అయ్యేవరకు జుహర్వేళ ఉంటుంది. దాని తర్వాత వెంటనే అస్ర్ వేళ ప్రారంభమవుతుంది.

## నమాజ్ రకాతులు

ఏ వేళ నమాజ్‌లో ఎన్నెన్ని రకాతులు చెయ్యడం అవసరమో క్రింద సూచించడం జరిగింది:

ఫజ్ర్: మొదట రెండు సున్నత్‌లు, తర్వాత రెండు ఫర్జ్‌లు (సున్నత్, ఫర్జ్‌లను గురించి గతంలో తెలుసుకున్నారు).

**జుహర్:** మొదట ఒకే చివరి సలామ్‌తో నాలుగు సున్నత్‌లు, తర్వాత ఒకేసారి నాలుగు ఫర్జ్‌లు మళ్ళీ రెండు సున్నత్‌లు.

**అస్ర్:** ఒకేసారి నాలుగు ఫర్జ్‌లు.

**మగ్రిబ్:** మొదట మూడు ఫర్జ్‌లు, తర్వాత రెండు సున్నత్‌లు.

**ఇషా:** మొదట నాలుగు ఫర్జ్‌లు, తర్వాత రెండు సున్నత్‌లు, మళ్ళీ మూడు విత్ర్‌లు, విత్ర్ గురించి తర్వాత వస్తుంది.

ఇవి కాకుండా మరికొన్ని రకాతులున్నాయి. వాటిని చెయ్యటం కూడా పుణ్యమే. కాని ఎలాంటి కష్టం లేకపోయినప్పటికీ వాటిని వదలినందువల్ల నమాజ్‌లో ఎలాంటి కొరతరాదు. వాటిని వదలడం తప్పు కూడా కాదు. అవి ఏమనగా:-

(1) జుహర్‌లో అన్నిటి కంటే చివర రెండు నఫిల్

(2) అస్ర్‌లో ఫర్జ్ కంటే మొదట నాలుగు సున్నత్‌లు

(3) మగ్రిబ్‌లో అన్నిటికంటే చివర రెండు నఫిల్.

(4) ఇషాలో మొదటి నాలుగు సున్నత్‌లు, అన్నిటి కంటే చివర రెండు నఫిల్.

ఫజ్ర్ నమాజ్ తర్వాత సూర్యోదయం అయిందాకా, అస్ర్ తర్వాత మగ్రిబ్ వరకు ఎలాంటి నమాజ్ చేయకూడదు. ఫర్జ్, సున్నత్, నఫిల్ గురించి ముందే తెలుసుకున్నారు. అయితే వాటిని గురించి మరికొన్ని విషయాలు తెలుసుకోవలసి ఉంది. వాటిని ఇక్కడ తెలుసుకోండి.

**ఫర్జ్:-** ఫర్జ్ నమాజ్ ఎలాంటి పరిస్థితిలో కూడా వదలి పెట్టకూడదు. వ్యాధి అయినా, ప్రయాణం అయినా ఎలాంటి స్థితి అయినా సరే చెయ్యడం అవసరం. అపస్మారకస్థితిలో లేక మతిభ్రమణ స్థితిలో తప్ప మనిషి తెలివితో, బుద్ధి కలిగి ఉన్నంతవరకు తప్పకుండా ఫర్జ్ నమాజ్ చెయ్యాలి. ఫర్జ్ నమాజ్

ఎల్లప్పుడూ జమాఅత్‌తో- సామూహికంగా చేయాలి. అనివార్య పరిస్థితి వస్తే అది వేరే విషయం. ఎలాంటి అనివార్య పరిస్థితి లేకుండానే సామూహిక నమాజ్ వదలడం ఘోరమైన తప్పు. మూడు రకాతుల నమాజ్ లో మూడవ రకాత్‌లోను మరియు నాలుగు రకాతుల నమాజ్‌లో చివరి రెండు రకాతుల్లోను ఫాతిహా సూరా తర్వాత మరే సూరా పఠించనవసరం లేదు.

**సున్నత్‌:-** వ్యాధితో బాధ ఎక్కువగా ఉన్నప్పుడు లేక ప్రయాణంలో ప్రశాంతత లేనప్పుడు సున్నత్ వదలిపెట్టవచ్చు. ఈ నమాజ్ ఎప్పుడూ ఒంటరిగానే చేసుకోవాలి. ఇందులో ప్రతి రకాత్‌లోను ఫాతిహా సూరా తర్వాత ఖుర్‌ఆన్‌లోని ఏదో ఓ భాగం తప్పకుండా పఠించాలి. అలాగే నఫిల్ నమాజ్ కూడా ఒంటరిగానే చేసుకోవాలి. అందులో కూడా ప్రతి రకాత్‌లో ఫాతిహా సూరా తర్వాత ఖుర్‌ఆన్‌లోని ఏదో ఓ భాగం పఠించాలి.

## విత్ర్ నమాజ్

విత్ర్ నమాజ్ వేళ ఇషా తర్వాత ప్రారంభమై ఉషోదయానికి ముందువరకూ ఉంటుంది. విత్ర్ నమాజ్‌లో మూడు రకాతులుంటాయి. రెండు రకాతుల తర్వాత ఖాయిదాలో కూర్చొని అత్తహియ్యాత్ చదివి మామూలుగా నిలబడాలి. అప్పుడు మూడవ రకాతులో ఫాతిహా సూరా తర్వాత ఖుర్‌ఆన్‌లోని ఏదో ఓ భాగం పఠించండి, తర్వాత 'అల్లాహు అక్బర్' అంటూ చేతుల్ని చెవుల దాకా ఎత్తి దించి యధాప్రకారం చేతులు కట్టుకోండి. అలా నిలబడే ఖునూత్ అనే ఈ దుఆ పఠించండి.

"అల్లాహుమ్మ ఇన్నా నస్‌తఈనుక వనస్‌తగ్ ఫిరుక వనుమిను బిక వనతవక్కలు అలైక వనుస్‌నీ అలైకల్ ఖైర వనష్ కురుక వ లానక్‌ఫురుక వనఖ్‌లఊ వ నత్‌రుకు మంయ్యఫ్ జురుక అల్లాహుమ్మ ఇయ్యాక న'బుదు వలకనుసల్లీ వ నస్‌జుదు వ ఇలైకనస్‌ఆ

**వనహ్‌ఫిదూ వ నర్‌జూ రహ్మతిక వ నఖ్‌షా అజాబక ఇన్న అజాబక బిల్ కుఫ్ఫారి ముల్‌హిఖ్"**

"అల్లాహ్! మేము నీ సహాయాన్ని కోరుతున్నాము. నిన్ను క్షమాపణ అర్థిస్తున్నాము, నిన్నే విశ్వసిస్తున్నాము. నీపై భరోసా చేస్తున్నాము. నిన్ను ఉత్తమరీతిలో కీర్తిస్తున్నాము, నీకు కృతజ్ఞత చూపుతున్నాము. నీ కృతఘ్నతకు లోనుకాము. నీ ఆజ్ఞల్ని అతిక్రమించే వారికి దూరంగా ఉంటాము, వారిని వదలి వేస్తాము.

దేవా! మేము నిన్నే ఆరాధిస్తున్నాము. నీ కోసమే నమాజ్ చేస్తున్నాము. సజ్దా చేస్తున్నాము. మా సకల కార్యకలాపాలన్నీ నీ కోసమే, మేము నీ సేవే చేస్తున్నాము. నీ అనుగ్రహాన్ని ఆశిస్తున్నాము. నీ శిక్షకు భయపడుతున్నాము. నిస్సందేహంగా నీ శిక్ష తిరస్కారులకు లభించడం తథ్యం.

# అజాన్ మరియు ఇకామత్

అజాన్ అంటే పిలుపు నివ్వటం అని అర్థం, నమాజ్‌కు ముందు నమాజ్ కోసం పిలవడానికి ఒకరు నిలబడి బిగ్గరగా పిలుస్తారు. దాన్నే అజాన్ అంటారు. మొట్టమొదట నాల్గు సార్లు బిగ్గరగా:

**"అల్లాహు అక్బర్"**

అల్లాహ్ అందరికంటే గొప్పవాడు అనాలి. తరువాత రెండేసి పర్యాయాలు దిగువనిచ్చిన మాటల్ని ఆ క్రమంలోనే బిగ్గరగా అనాలి.

**"అష్‌హదు అల్లాయిలాహ ఇల్లల్లాహ్"**

అల్లాహ్ తప్ప ఆరాధింపదగినవాడెవడూ లేడని నేను సాక్ష్యమిస్తున్నాను.

**"అష్‌హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్"**

ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ సందేశహరుడు అని నేను సాక్ష్యమిస్తున్నాను.

**"హయ్య అలస్సలాహ్"**

నమాజ్ వైపునకు రండి,

**"హయ్యఅలల్ ఫలాహ్"**

సాఫల్యం వైపునకు రండి,

**"అల్లాహు అక్బర్"**

అల్లాహ్ అందరికంటే గొప్పవాడు, ఆ తర్వాత ఒకసారి **"లాయిలాహ ఇల్లల్లాహ్"** (అల్లాహ్ తప్ప ఆరాధింపదగిన వాడెవడూ లేడు) అని చెప్పి ముగించాలి.

ఫజర్ అజాన్‌లో **"హయ్యఅలల్‌ఫలాహ్"** తర్వాత రెండు సార్లు **"అస్సలాతు ఖైరుమ్ మినన్నౌమ్"** (నిద్ర కంటే నమాజ్ మేలైనది) అని పలకాలి.

ప్రతి ఫర్జ్ నమాజ్‌కు ముందు నమాజ్ వేళ కాగానే తప్పనిసరిగా అజాన్ చెప్పాలి, నమాజ్ చేసేవాళ్ళు ఒకడున్నా పలువురున్నా; నమాజ్ మస్జిద్‌లో చేసినా మరెక్కడ చేసినా సరే అజాన్ చెప్పటం చాలా అవసరం. ప్రయాణంలో ఉన్నా కూడా అజాన్ చెప్పాలి.

అజాన్ చెప్పేటప్పుడు ముఖం ఖిబ్లా వైపుకు ఉండాలి. రెండు చూపుడు వ్రేళ్ళను చెవుల్లో ఉంచాలి. సాధ్యమైనంత వరకు ఏదైనా ఎత్తయిన ప్రదేశంపై నిలబడి అజాన్ బిగ్గరగా చెప్పాలి, **'హయ్యఅలస్సలాహ్'** అని చెప్పేటప్పుడు కుడి వైపునకు **'హయ్యఅలల్‌ఫలాహ్'** అని చెప్పేటప్పుడు ఎడమ వైపునకు ముఖంతిప్పాలి. వుజూ లేకుండా కూడా అజాన్ చెప్పవచ్చు. వుజూ చేసి అజాన్ చెప్పడం మంచిది.

ఫర్జ్ నమాజ్ ప్రారంభించటానికి ముందు అజాన్‌లో చెప్పిన మాటలే తిరిగి చెప్పాలి, అందులో హయ్యఅలల్ ఫలాహ్ తర్వాత రెండు సార్లు

**'కద్‌కామతిస్సలాహ్'** (ఇక నమాజ్ కోసం జమాఅత్ నిలబడులోంది) అనే మాటలు అదనంగా పలకాలి, దీన్ని ఇకామత్ అంటారు. ఇకామత్‌లో హయ్య అలస్సలాహ్, హయ్య అలల్‌ఫలాహ్ అంటూ ముఖం కుడి, ఎడమల వైపునకు తిప్పనవసరంలేదు.

## నమాజ్‌లో పొరపాటు

నమాజ్ చేయటానికి కొన్ని గమనించవలసిన విషయాలున్నాయి. వాటిని విస్మరిస్తే అసలు నమాజే కాదు. మళ్ళీ నమాజ్ చేయవలసి వస్తుంది. కొన్ని విషయాల పట్ల పొరపాటు జరిగినా నమాజ్ పూర్తవుతుంది. అంచేత వాటిని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి.

ఏ విషయాలైతే లోపించినందువల్ల నమాజ్ పూర్తికాదో వాటిని ఇక్కడ పేర్కొంటున్నాము. వీటిలో ఏ ఒక్కటి లోపించినా నమాజ్ మళ్ళీ చేయవలసివస్తుంది.

(1) ఏ నమాజ్ చేయవలసి ఉందో ఆ నమాజ్ వేళ కావాలి. వేళకాని వేళ నమాజ్ చేస్తే నమాజ్ కాదు.

(2) నమాజ్ చేసే వ్యక్తి దేహం, బట్టలు, నమాజ్ చేసే ప్రదేశం పరిశుద్ధంగా ఉండాలి, పరిశుద్ధతను గురించి మీరిదివరలో తెలుసుకున్నారు.

(3) నమాజ్ చేయబోయే వ్యక్తి స్నానం చేయవలసిన అవసరం ఉంటే స్నానం చేసి ఉండాలి; వుజూ చేయవలసి ఉంటే వుజూ చేసి ఉండాలి. అనివార్య పరిస్థితులయితే తయమ్ముం చేసుకోవాలి, తయమ్ముం గురించి కూడా మీరు తెలుసుకున్నారు.

(4) పురుషులకు కనీసం నాభి నుండి మోకాళ్ళక్రింది వరకు దేహంలోని ఏ భాగమూ కనబడకుండా కప్పబడి ఉండాలి. స్త్రీలకు ముఖం, ముంజేతులు, పాదాలు తప్ప తక్కిన శరీరమంతా ఏ మాత్రం కనబడకుండా కప్పబడి ఉండాలి.

(5) నమాజ్ ప్రారంభించటానికి ముందు సంకల్పం, (నియ్యత్) చేసుకోవాలి. అంటే మీరు ఏ నమాజ్ చేయబోతున్నారు?, అది ఫర్జా? సున్నతా? లేక నఫిలా? ఎన్ని రకాతులు చెయ్యబోతున్నారు? అనే విషయాలు దృష్టిలో ఉంచుకుని అలాగే సంకల్పం చేసుకోవాలి. సంకల్పం (నియ్యత్) లేకపోతే నమాజ్ కాదు. సంకల్పం చేసే మాటలు నోటితో ఉచ్చరించినా మంచిదే. లేకపోయినా ఫరవాలేదు. మనసులో అనుకుంటే చాలు.

(6) సంకల్పం అనంతరం 'అల్లాహు అక్బర్' అని చెప్పి చేతులు కట్టుకోవాలి.

(7) నిటారుగా నిలబడాలి.

(ఇమామ్ రుకూలో గాని, సజ్దాలో గాని, కాయిదాలో గాని ఉన్నప్పుడు మీరు వచ్చారనుకోండి, అప్పుడు మీరు మొదట నిటారుగా నిలబడి 'అల్లాహు అక్బర్' అని చెప్పటం చాలా ముఖ్యం. తర్వాత మళ్ళీ 'అల్లాహు అక్బర్' అంటూ ఇమామ్‌తో పాటు కలవాలి).

(8) ఫాతిహా సూరా పఠించాలి.

(9) ప్రతి రకాత్‌లో ఒక రుకూ, రెండు సజ్దాలు చేయాలి.

(10) చివరి రకాత్ అంతంలో, 'అత్తహియ్యాత్' పఠించేందుకు అవసరమయినంత సమయం కూర్చోవాలి.

నమాజ్‌లో మరికొన్ని విషయాలున్నాయి. వాటిని మరచిపోయి వదలినప్పుడు ఆఖరిలో 'సహూ సజ్దా' చేస్తే నమాజ్ పరిపూర్ణమవుతుంది. ఆ విషయాలు ఏమనగా:-

(1) సున్నత్, నఫిల్, విత్ర్ రకాతులన్నింటిలో; ఫర్జ్ రకాతుల్లోని మొదటి రెండు రకాతుల్లో ఫాతిహా సూరా తర్వాత ఏదైనా రెండవ సూరా లేక అవసరమయినంత ఖుర్‌ఆన్ భాగం పఠించాలి.★

---

★ ఖుర్‌ఆన్ భాగంలోని కనీసపు ఎంత భాగం పఠించాలన్నది గతంలో తెలియజెయ్యబడింది.

(2) రుకూ, సజ్దాలలో కనీసం ఒకసారి 'తస్బీహ్'★ (స్మరణ) చేసేటంతటి సమయం ఉండాలి.

(3) రుకూ నుంచి సజ్దా స్థితికి పోయే ముందు నిటారుగా నిలబడాలి.

(4) రెండు సజ్దాల మధ్య సరిగ్గా కూర్చోవాలి.

(5) రెండు కంటే ఎక్కువ రకాతులు గల నమాజ్‌లోని మొదటి రెండు రకాతుల తర్వాత అత్తహియ్యాత్ పఠించటానికి కూర్చోవాలి. మరియు అత్తహియ్యాత్ పఠించాలి.

(6) ఆఖరి కాయిదాలో 'అత్తహియ్యాత్' పఠించాలి.

(7) ఇమామ్ జుహర్, అస్ర్ నమాజుల్లోని నాలుగు రకాతుల్లో దివ్య ఖుర్ఆన్ నిశ్శబ్దంగా పఠించాలి. ఫజ్ర్, మగ్రిబ్, ఇషా నమాజుల్లోని మొదటి రెండు రకాతుల్లో బిగ్గరగా, మిగతా రకాతుల్లో నిశ్శబ్దంగా పఠించాలి.

(8) విత్ర్ నమాజ్ లోని మూడవ రకాత్‌లో రుకూకు ముందు 'దువాయె కునూత్' పఠించాలి.

ఈ పై విషయాలు మరచిపోయి వదిలేస్తే "సహూ సజ్దా" చేస్తేచాలు. నమాజ్ మళ్ళీ చేయవలసిన అవసరంలేదు. సజ్దా సహూ చేయకపోతే మళ్ళీ నమాజ్ చేయవలసి ఉంటుంది. సజ్దా సహూ చేసే పద్ధతి ముందు వస్తుంది.

ఈ క్రింద కొన్ని విషయాలు ఇస్తున్నాం. వాటిలో ఏదైనా పొరపాటున వదిలేసినా నమాజ్ అవుతుంది (ఎలాంటి లోపం రాదు). వాటిని వదలి పెట్టినందువల్ల సహూ సజ్దా కూడా చేయనవసరం లేదు. అయితే తెలిసి బుద్ధి పూర్వకంగా వదలటం తప్పు.

---

★ సుబ్‌హాన రబ్బిఅల్ అజీమ్, సుబ్‌హాన రబ్బిఅల్ ఆలా పఠించటాన్ని తస్బీహ్ అంటారు.

(1) సంకల్పం చేసిన తర్వాత అల్లాహు అక్బర్ అంటూ రెండుచేతుల్ని పురుషులు చెవుల వరకు, స్త్రీలు భుజాల వరకు ఎత్తడం.

(2) రెండు చేతుల వ్రేళ్ళను ఖిబ్లావైపుకు త్రిప్పి చాచి ఉంచటం.

(3) మొదటి రకాత్‌లో సనా, 'అవూజు బిల్లాహి మినష్షైతా నిర్రజీమ్' చదవడం.

(4) ప్రతి రకాతులో ఫాతిహా సూరాకు ముందు బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ చదవటం.

(5) రుకూ, సజ్దా స్థితుల్లోకి పోతున్నప్పుడు, సజ్దానుండి తల ఎత్తినప్పుడు ప్రతీసారి అల్లాహు అక్బర్ అనటం.

(6) రుకూ, సజ్దాలలో కనీసం మూడేసి సార్లు తస్బీహ్ స్మరించటం.

(7) రుకూ నుంచి తల ఎత్తేటప్పుడు "సమి అల్లాహు లిమన్ హమిదా" అని నిలబడి "రబ్బనా లకల్ హమ్‌ద్" అని పలకడం, ఇమామ్ వెనుక ఉండేవారు "రబ్బనా లకల్ హమ్‌ద్" అని మాత్రమే చెప్పాలి.

(8) "అత్తహియ్యాత్" పఠిస్తూ "అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్" అనేటప్పుడు చూపుడు వ్రేలితో సంజ్ఞ చేయటం.

(9) చివరి ఖాయిదాలో దరూద్ మరియు దువా పఠించటం.

(10) నమాజ్ అంతంలో ముందు కుడివైపు ఆ తర్వాత ఎడమవైపు ముఖం త్రిప్పి "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్" అని పలకడం.

## సహూ సజ్దా చేసే విధానం

నమాజ్ అంతంలో 'అత్తహియ్యాత్' పఠించిన తర్వాత కుడివైపుకు ముఖం త్రిప్పి "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్" అని చెప్పాలి, తర్వాత 'అలాహు అక్బర్' అంటూ సజ్దా చేయాలి. తరువాత మరో సజ్దా

చేయాలి. అప్పుడు తిరిగి 'అత్తహియ్యాత్' ఆ తర్వాత దరూద్ మరియు దువా పఠించి మామూలుగా సలాము ద్వారా నమాజ్ ముగించాలి.

## నమాజ్‌ను భంగపరిచే విషయాలు

ఏ విషయాల వల్ల నమాజ్ భంగమవుతుందో వాటిని క్రింద ఇస్తున్నాం, అలాంటిది ఏదైనా జరిగితే నమాజ్ మళ్ళీ చేయవలసి ఉంటుంది:

1) నమాజ్‌లో మాట్లాడటం- తెలిసి అయినా, పొరపాటున అయినా, ఇంకా కొద్దిగా మాట్లాడినా లేక ఎక్కువగా మాట్లాడినా సరే.
2) నమాజ్‌లో ఉండి ఎవరికయినా సలామ్ చేయడం లేక సలామ్‌కు ప్రతి సలాం చేయటం.
3) ఏదైనా బాధ వల్ల అబ్బా, అయ్యో అనటం.
4) చూచి ఖుర్‌ఆన్ పఠించటం,
5) చూసేవారు "ఇతను నమాజ్ చెయ్యటం లేదు" అనుకునేలా ఏదయినా పని చేయడం.
6) ఏదయినా తినడం లేక త్రాగడం.
7) ఖుర్‌ఆన్ పఠనంలో, ఖుర్‌ఆన్ భావాన్నే తారుమారు చేసే అర్థం వచ్చేలా పొరపాటు చెయ్యడం.
8) రెండు నమాజ్ వరుసలకు కావలసినంత దూరం నమాజ్‌లో నడవటం.
9) ఖిబ్లా వైపు నుంచి ముఖం త్రిప్పటం.
10) అపరిశుద్ధమయిన ప్రదేశంలో నమాజ్ చేయటం.
11) కిలకిలా నవ్వటం.
12) ఇమామ్‌ను దాటి నిలబడటం.

నమాజ్ చేసేటప్పుడు మనం వేసుకున్న బట్టలు కూడా సక్రమంగా ఉండాలి, అలసత్వంతో వస్త్రం నెత్తి మీద వేసుకోవడం, చొక్కా లేక కోటు సరిగ్గా తొడగకుండా అలాగే చేతులకు తగిలించుకోవటం, భుజం మీద

తువ్వాలో, దుప్పటో వేసుకోవటం సరయిన పద్ధతి కాదు. ఏ బట్టల నయితే తొడిగి ప్రజల్లో తిరగడాన్ని ఇష్టపడమో అలాంటివి తొడిగి నమాజ్ లోకి వెళ్ళరాదు. బద్ధకంతో, నిర్లక్ష్యం వల్ల టోపి లేకుండా నమాజ్ చేయటం కూడా మంచిది కాదు.

## ఎట్టి పరిస్థితుల్లో నమాజ్‌ని భంగపరచుకోవచ్చు?

నమాజ్ చేయటం మొదలెట్టిన తర్వాత దాన్ని భంగపరచడం సరయిన విధానం కాదు. ఒకవేళ అనివార్య పరిస్థితి ఏదైనా ఏర్పడితే అది వేరే విషయం. ఏ పరిస్థితుల్లో నమాజ్‌ని భంగపరచవచ్చో వాటిలో కొన్నింటిని క్రింద ఇస్తున్నాం:

1) పాము, తేలు, పులి, తోడేలు, పిచ్చికుక్క మొదలైన బాధించే కీటకాలు, జంతువుల భయం కలిగినప్పుడు,

2) ఏదైనా కొంచెం విలువైన వస్తువు నష్టపోతుందన్న భయం కల్గినపుడు

3) రైలు లేక బస్సు అందనపుడు, ప్రయాణం చెయ్యకపోతే ఏదయిన నష్టం సంభవిస్తుందనుకుంటే లేక బండిలో సామాను, పిల్లా జెల్లా ఉన్నపుడు,

4) నమాజ్‌లో మలమూత్రాల అవసరం తీవ్రమైనప్పుడు,

5) ఎవరయినా ఆపదలో చిక్కుకుంటే వారిని కాపాడే అవసరం వచ్చినప్పుడు. ఉదాహరణకు:- ఎవరైనా మంటలకు గురయితే, లేక నీళ్ళలో మునిగిపోతుంటే లేక మరే ఆపదలోనైనా చిక్కుకున్నప్పుడు, అలాంటి పరిస్థితుల్లో నమాజ్ భంగపరచకపోవడం ఘోరమైన పాపం.

6. తల్లిదండ్రులు, తాతా బామ్మలు తదితర పెద్దలు అవసరం ఉండి పిలిచినపుడు.

## తరావీహ్ నమాజ్

రమజాన్ మాసంలో ఇషా నమాజ్ తర్వాత, విత్ర్ నమాజ్‌కు ముందు ఇరవై రకాతుల నమాజ్ చెయ్యడం జరుగుతుంది, దాన్ని "తరావీహ్ నమాజ్" అనంటారు. ఏదైనా అనివార్యమైతే వీటిని విత్ర్ నమాజ్ తర్వాత కూడా చెయ్యవచ్చు. ఉషోదయానికి పూర్వం వరకూ ఈ నమాజ్ వేళ ఉంటుంది. తరావీహ్ నమాజ్ సామూహికంగా చేయడం మంచిది. రమజాన్ నెలలో కనీసం ఒకసారి ఖుర్‌ఆన్ మొత్తం పఠించటం సున్నత్ (మహాప్రవక్త సంప్రదాయం). ఖుర్‌ఆన్ సాంతం జ్ఞాపకం లేని వారు జ్ఞాపకం ఉన్నంత వరకే 'తరావీహ్'లో పఠించాలి.

## వ్యాధిగ్రస్తుని నమాజ్

రోగావస్థలో కూడా నమాజ్ వదలటానికి అనుమతి లేదని మీరు తెలుసుకున్నారు. ఒకవేళ రోగ కారణంగా బలహీనత ఏర్పడినందువల్ల లేక ఏదైనా బాధ ఉన్నందువల్ల నిలబడలేకపోతే కూర్చొని నమాజ్ చేయవచ్చు. రుకూ, సజ్దాలు చేయలేకపోతే సంజ్ఞల ద్వారా రుకూ సజ్దాలు చేయవచ్చు. కూర్చోటానిక్కూడా శక్తిలేనప్పుడు పడుకొని ఉండీ తల, చేతుల సంజ్ఞల ద్వారా నమాజ్ చేయాలి. పడుకొని ముఖం కాబావైపుకు పెట్టాలి. తలా, చేతులు కూడా ఆడించటానికి శక్తిలేనప్పుడు నమాజ్ చేయనవసరం లేదు. అలాంటి వారికి నమాజ్ మాఫీ చెయ్యబడుతుంది. ఆ స్థితిలో వరుసగా ఐదు నమాజ్‌లు తప్పితే వాటిని తిరిగి చేయనవసరం లేదు. ఐదుకు లోపు నమాజ్‌లు తప్పితే మాత్రం తిరిగివాటిని (ఆరోగ్యవంతుడయినప్పుడు) చేయాలి.

## ప్రయాణీకుని నమాజ్

ఎవరయినా తన ఇంటి నుంచి కనీసం నలభై ఎనిమిది మైళ్ళకు తక్కువ కాని దూర ప్రదేశానికి బయల్దేరితే అతడు, 'ప్రయాణీకుడు' అనబడ

తాడు. ఇంటి నుంచి బయలుదేరగానే అతను ప్రయాణీకుడుగా పరిగణించ బడతాడు. ప్రయాణీకుడు ఫర్జ్ నమాజ్‌లో నాలుగు రకాతులకు బదులు రెండు రకాతులు మాత్రమే చెయ్యాలి. మూడు రకాతుల నమాజ్‌ను తగ్గించ కూడదు. ప్రయాణంలో సున్నత్ నమాజ్ వదలిపెట్టవచ్చు కాని ఎలాంటి తొందర లేకుండా, ప్రశాంతంగా ఉంటే సున్నత్ నమాజ్ కూడా చేయటం మంచిది. ఫజ్ర్ నమాజ్‌లోని సున్నత్ రకాతులు ప్రయాణంలో కూడా వదలి వేయరాదు. ఇది చాలా ముఖ్యం.

సామూహిక నమాజ్ చేయవలసి వచ్చినపుడు పూర్తి నమాజ్ చేయాలి. ఇమామ్ కూడా ప్రయాణీకుడయితే నాలుగు రకాతుల ఫర్జ్ నమాజ్‌లో రెండు రకాతులే చేస్తాడు. అలాంటి ఇమామ్ వెనుక నమాజ్ చేసే వాళ్ళు ప్రయాణీకులైతే ఇమామ్‌తో పాటు సలాం చేసి నమాజ్ ముగించుకుంటారు. ప్రయాణీకులు కాని వారు అలా చేయక వెంటనే లేచి మిగిలిన రెండు రకాతులు పూర్తి చేసుకోవాలి.

'ప్రయాణీకుడు' ఒకవేళ ఎక్కడైనా పదిహేను లేక అంతకంటే ఎక్కువ రోజులుండాలని సంకల్పించుకుంటే ఆ ప్రదేశం చేరిన తర్వాత అతను ప్రయాణీకుడుగా ఉండడు. అంటే అప్పుడతను పూర్తి నమాజ్ చేయాలి. అంతకంటే తక్కువ రోజులు ఉండాలని సంకల్పించుకుంటే మాత్రం ప్రయాణీకుడిగానే పరిగణించబడతాడు.

## జుమా నమాజ్

శుక్రవారం (జుమా) రోజు మామూలుగా జుహర్‌లో చేసే నాలుగు రకాతుల ఫర్జ్ నమాజ్‌కు బదులు రెండు రకాతులే ఫర్జ్ నమాజ్ జమాఅత్‌తో చేయబడుతుంది, దాన్ని 'జుమా నమాజ్' అంటారు. ఆ రెండు రకాతుల ఫర్జ్‌తో పాటు జుహర్‌లో చేసే సున్నత్‌లు కూడా చేయబడతాయి. అయితే ఫర్జ్ తర్వాత మరో నాలుగు రకాతులు సున్నత్ నమాజ్ కూడా చెయ్యడం మంచిది.

జుమా నమాజ్ ముస్లిం పురుషులకు ఫర్జ్‌గా విధించబడింది. జుమా నమాజ్‌కు ముందు ఇమామ్ మస్జిద్‌లో హాజరు అయిన వారికి ధార్మిక విషయాలను గురించి బోధిస్తాడు. దాన్ని 'ఖుత్బా' లేక ప్రసంగం అంటారు. జుమా నమాజ్‌లో ఖుత్బా తప్పనిసరిగా ఉండాలి. ఖుత్బాలేకుండా ఈ నమాజ్ కాదు. ఖుత్బా వినటం కూడా చాలా అవసరమే. ఖుత్బా ప్రారంభించగానే అందరూ నిశ్శబ్దంగా కూర్చోవాలి. ఆ సమయంలో మాట్లాడటం, నమాజ్ చేయటం, తినటం, త్రాగటం, ఖుర్‌ఆన్ పఠించటం, సలామ్ చేయటం, ప్రతి సలామ్ చేయటం, దైవనామ సంస్మరణలాంటిది చేయటం- అన్నీ నిషిద్ధం. ఖుత్బా ఇవ్వటానికి ఇమామ్ మింబర్ మీద కూర్చున్నప్పుడు అతని ఎదురుగా నిలబడి అజాన్ ఇవ్వాలి. తర్వాత ఇమామ్ నమాజ్‌కై వచ్చిన శ్రోతలనుద్దేశించి ఖుత్బా ఇవ్వాలి. రెండు ఖుత్బాలు ఉంటాయి. రెండింటి మధ్య ఇమామ్ కొంచెం సేపు విరామంగా కూర్చోవాలి.

కొందరికి జుమా నమాజ్ నుండి మినహాయింపు ఉంది. వారెవరంటే- స్త్రీలు, పిల్లలు, ఖైదీలు, ఉన్మత్తులు, వ్యాధిగ్రస్తులు, అంధులు, వికలాంగులు, ప్రయాణీకులు. అయితే వీరిలో ఎవరయినా జుమా నమాజ్ చేస్తే అందులో తప్పులేదు. మళ్ళీ అలాంటి వ్యక్తి జుహర్ నమాజ్ చేయవలసిన అవసరం లేదు. జుమా నమాజ్ చేయలేని వాడు జుహర్ నమాజ్ చేసుకోవాలి. జుమా నమాజ్ సామూహికంగా చేయాలి. ఒంటరిగా చేస్తే నమాజ్ కానేకాదు. ఇమామ్ కాకుండా కనీసం మరో ముగ్గురు అయినా ఉండాలి. అంతకంటే తక్కువ వ్యక్తులుగల జమాఅత్ జుమా నమాజ్ చేసినా అది నెరవేరదు.

జుమా నమాజ్ కోసం అజాన్ కాగానే అమ్మటం, కొనటం సమస్తం హరామ్ ★(నిషిద్ధం) అయిపోతాయి. దీన్ని గురించి చాలా తక్కువ మంది ఆలోచిస్తారు, మీరు మాత్రం గుర్తించుకోండి, జుమా అజాన్ కాగానే మీరేమీ

★ నిషేధం అని ప్రామాణికంగా రుజువు చేయబడిన దాన్ని "హరామ్" అంటారు. దాన్ని కాదనేవాడు కాఫిర్ అవుతాడు. దానికి పాల్పడినవాడు ఘోరమయిన పాపం చేసిన వాడవుతాడు, అతనికి ఘోరశిక్ష విధించబడుతుంది.

కొనటం గాని, అమ్మటం గాని చేయకండి, నమాజ్ అయిపోయిన తర్వాత అమ్మవచ్చు, కొనవచ్చు.

## ఈద్ నమాజ్

మనకు రెండు పండుగలున్నాయి. ఒకటి రమజాన్ నెల ఉపవాసాల తర్వాత వచ్చే పండుగ, దాన్ని 'ఈదుల్ ఫిత్ర్' అంటారు. రెండవది ఖుర్బానీ పండుగ, దాన్ని 'ఈదుల్ అజ్హా' అంటారు. ఈద్ నమాజ్‌కు ముందు అజాన్‌గాని, ఇఖామత్ గాని చెప్పకూడదు. ఈద్ నమాజ్‌లో కూడా ఖుత్బా ఉంటుంది. అయితే ఈ ఖుత్బా నమాజ్ తర్వాత ఇవ్వబడుతుంది. ఎవరికయితే జుమా నమాజ్ విధి అవుతుందో వారికే ఈద్ నమాజ్ కూడా విధి అవుతుంది. ఈద్ నమాజ్‌లో కూడా రెండు రకాతులుంటాయి. కాని వీటి ప్రతి రకాత్‌లో మూడేసి తక్బీరులు అదనంగా ఉంటాయి. ఈద్ నమాజ్ చేసే విధానం ఈ క్రింది విధంగా ఉంటుంది.

సంకల్పం చేసుకున్న తర్వాత ఇమామ్ 'అల్లాహు అక్బర్' చెప్పగానే మీరు కూడా 'అల్లాహు అక్బర్' అంటూ చేతులు చెవుల వరకు ఎత్తి ఇతర నమాజుల్లో మాదిరిగానే చేతులు కట్టుకోండి, సనా పఠించి ఇమామ్ చెప్పే తక్బీర్‌లు ఆలకిస్తూ ఉండండి. ఇమామ్ సనా పఠించిన తర్వాత మూడు సార్లు 'అల్లాహు అక్బర్' అంటూ చేతులు చెవుల వరకు ఎత్తుతాడు. మీరు కూడా అలాగే 'అల్లాహు అక్బర్' అంటూ చేతులు చెవుల వరకు ఎత్తండి. కాని అప్పుడు చేతులు కట్టుకోకుండా క్రిందకు వదలివేయండి. మొదటి రెండుసార్లు అలాగే చేయాలి. మూడవసారి మాత్రం 'అల్లాహు అక్బర్' అని చెప్పి చేతులు కట్టుకోండి. ఇప్పుడు మౌనంగా నిలబడి ఇమామ్ పఠించేది వినండి. ఇమామ్ ఫాతిహా సూరా, ఆ తర్వాత ఖుర్ఆన్‌లోని ఏదో ఓ భాగం పఠించి రుకూలోకి పోతాడు. తర్వాత రెండు సజ్దాలు చేస్తాడు. మీరు కూడా అలాగే ఇతర నమాజుల్లో అనుసరించినట్లు ఇమామ్‌ను అనుసరించండి.

రెండవ రకాత్‌లో ఇమామ్ నిలబడి ఫాతిహా సూరా ఖుర్‌ఆన్‌లోని మరో సూరా పఠించి మొదటి రకాత్‌లో మాదిరిగానే 'అల్లాహు అక్బర్' అంటూ చేతులు చెవులదాకా ఎత్తుతాడు. అలాగే మీరు కూడా 'అల్లాహు అక్బర్' అంటూ చేతులు ఎత్తండి, మూడుసార్లు ఇలాగే చేయాలి, మూడుసార్లు కూడా చేతులు క్రిందికి వదలివేయాలి. నాల్గవసారి చేతులెత్తకుండా 'అల్లాహు అక్బర్' అంటూ రుకూ చెయ్యండి. మిగతా నమాజ్ ఇతర నమాజుల మాదిరిగానే ముగించాలి.

ఈద్ నమాజ్ వేళ బారెడు పొద్దెక్కిన తర్వాత ఆరంభమై సూర్యుడు వాలటానికి పూర్వం వరకూ ఉంటుంది. ఈద్ నమాజ్‌కు ముందు ఇంట్లోగాని, ఈద్‌గాహ్‌లో గాని మరియు ఈద్ నమాజ్‌కు తర్వాత ఈద్ గాహ్‌లోగాని ఎలాంటి నఫిల్ నమాజ్ చేయకూడదు. ఈద్ నమాజ్ ఈద్‌గాహ్‌లో చేయాలి. వీలైనంతవరకు ఈద్‌గాహ్‌కు కాలి నడకన పోవాలి. ఒక బాటన పోయి మరో బాటన తిరిగిరావటం సున్నత్. దారిలో ఈ క్రింది ప్రార్థన పఠిస్తూ పోవాలి.

**"అల్లాహు అక్బర్–అల్లాహు అక్బర్–లా ఇలాహ ఇల్లల్లాహు– వల్లాహు అక్బర్–అల్లాహు అక్బర్ – వలిల్లాహిల్ హమ్‌ద్."**

పండగ రోజు స్నానం చేయటం, మిస్వాక్(దంతధావన) చేయటం, దైవమిచ్చిన వస్త్రాల్లో మంచివైనవి ధరించటం, సువాసన ద్రవ్యాలు రాసుకోవటం సున్నత్.

## ఖుర్బాని (పశు త్యాగం)

ఖుర్బాని పండుగ (ఈదుల్ అజ్‌హా) నాడు, ఈద్‌నమాజ్ తర్వాత, జకాత్ విధి అయిన వారంతా ఖుర్బానీ (పశు త్యాగం) కూడా చేయాలి.

మీరు హజ్రత్ ఇబ్రాహీం (అస్సలాం) పేరు వినేవుంటారు. ఆయన, మక్కా పట్టణాన్ని నిర్మించి, ఆ పట్టణంలో ప్రజల్ని నివసింపజేసి అక్కడ

ఒకే దేవుని ఆరాధన కొరకు 'కాబా' అనబడే ఆలయం కూడా కట్టించిన దైవ ప్రవక్త. ఒకసారి కలలో ఆయన తన కుమారుడు ఇస్మాయీల్ (అస)ని ఖుర్బానీ చేస్తున్నట్టు చూశారు, దాన్ని ఆయన దైవ ప్రీతి కొరకు తన కొడుకును అర్పించమని దేవుని సూచనగా తెలుసుకున్నారు, ఆ విషయాన్ని హజ్రత్ ఇబ్రాహీం (అస) తన కుమారునికి తెలియజేశారు. హజ్రత్ ఇస్మాయీల్ (అస) వెంటనే అందుకు అంగీకరించి "నాన్నా! మీకు ఇవ్వబడిన ఆదేశాన్ని నెరవేర్చండి, ఇన్షా అల్లాహ్ దైవం కోరితే ప్రాణం అర్పించటంలో నేనే విధంగాను వెనకాడనని మీరు గ్రహిస్తారు" అని అన్నారు.

తండ్రీ కొడుకులు ఇద్దరూ ఇష్టపడ్డారు. కాని సరిగ్గా అదే సమయానికి దేవుడు వాళ్ళను కటాక్షించాడు. కుమారునికి బదులు ఒక గొఱ్ఱెని ఖుర్బాని చేయమని ఆజ్ఞాపించాడు. పండుగ రోజు చేసే ఖుర్బానీ (పశు త్యాగం) ఆ సంఘటన జ్ఞాపకార్థమే ఖుర్బానీ చేసి, ముస్లిములు, తాము కూడా హజ్రత్ ఇబ్రాహీం (అస్సలాం) లాగానే దైవ విధేయులమని, దైవ ప్రీతికోసం తమ ధనాన్ని, ప్రాణాన్ని, సంతానాన్ని -సమస్తమూ త్యాగం చేయటానికి సిద్ధమేనని నిరూపించుకుంటున్నారు.

ఖుర్బానీ ఇస్లాం ఆజ్ఞలలో ఒక ముఖ్యమయిన ఆజ్ఞ. దైవ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) దీన్ని ఆదేశించారు:

"ఈ రోజు (బఖర్ ఈద్). మనం అన్నిటికంటే ముందు చేసే పని ఏమిటంటే, నమాజ్ చేయటం, తర్వాత ఇంటికి వెళ్ళి ఖుర్బానీ చేయడం" అన్నారు ఆయన.

ఖుర్బానీ కోసం పూర్తిగా ఒక సంవత్సరం నిండిన మేక లేక గొఱ్ఱె కావాలి. ఆవు, ఎద్దు, దున్నపోతు అయితే రెండు సంవత్సరాలకు తక్కువయినది కాకుండా ఉండాలి. ఒంటెకు ఐదు సంవత్సరాలు ఉండాలి. అంతకంటే తక్కువ వయస్సున్న పశువుల ఖుర్బాని కాదు. సులువుగా తిరగలేనంత బలహీనంగా, ముసలిగా ఉన్న పశువులను ఖుర్బానీ చేయటం భావ్యం కాదు.

కుంటిది, ఒంటి కంటిది, గ్రుడ్డిది, చెవులు తెగిన జంతువుల ఖుర్బానీ కూడా అవదు. మేక, గొఱ్ఱెలాంటివి ఒక్కో మనిషి తరపున, ఒక్కో జంతువును ఖుర్బానీ చేయాలి. కాని ఆవు, గేదె లేక ఒంటె లాంటివయితే ఒక దాన్ని ఏడుగురు వ్యక్తుల తరపున త్యాగ దానం చెయ్యవచ్చు.

ఖుర్బానీ, ఈద్ నమాజ్ తర్వాత చేయాలి. నమాజ్‌కు ముందుగానే ఖుర్బానీ చేయకూడదు, పదవ తేదీన ఈద్ నమాజ్ తర్వాత పన్నెండవ తేది సూర్యాస్తమయానికి పూర్వంవరకు ఖుర్బానీ చేయవచ్చు. ఖుర్బానీ మాంసం పేదలకు పంచండి, బంధు మిత్రులకు ఇవ్వండి మీరూ తినండి.

ఈదుల్ అజ్‌హా (బఖర్ ఈద్) జిల్‌హజ్ నెలలో వస్తుంది. ఆ నెల తొమ్మిది తేదీన హజ్ అవుతుంది. పదో తేది పండుగ అవుతుంది. జిల్‌హజ్ తొమ్మిదో తేది ఫజ్ర్ నమాజ్ మొదలుకుని పదమూడో తేది అస్ర్ నమాజ్ వరకు ప్రతి ఫర్జ్ నమాజ్ అనంతరం 'తక్బీర్' చెప్పాలి. తక్బీర్ కాస్త బిగ్గరగా చెప్పాలి. తక్బీర్ పలుకులు క్రింద చూడండి.

"అల్లాహు అక్బర్– అల్లాహు అక్బర్–లా ఇలాహ ఇల్లల్లాహు
వల్లాహు అక్బర్– అల్లాహు అక్బర్–వలిల్లాహిల్ హమ్‌ద్."

అల్లాహ్ అందరికంటే గొప్పవాడు, అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. అల్లాహ్ తప్ప వేరే దైవం లేడు.అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. సమస్త స్తోత్రాలు అల్లాహ్ కొరకే.

## జనాజా నమాజ్

మనిషి చనిపోయిన తర్వాత అతని కొరకు అందరూకలసి ప్రార్థన చేస్తారు. దాన్ని 'జనాజా నమాజ్' అంటారు. జనాజా నమాజ్ చేసే విధానం ఈ క్రింద తెలుపబడుతోంది.

మృత కళేబరానికి స్నానం చేయించి, పరిశుభ్రమయిన కఫన్

తొడిగి, సమాధి చేయటానికి సిద్ధపరచిన తర్వాత అందరూ ఖిబ్లా వైపుకు తిరిగి వరుసలు తీర్చి నిలబడాలి, వరుసలు మూడు, ఐదు లేక ఏడు (బేసి సంఖ్యలో) ఉండటం మంచిది. ఒకరు ఇమామ్ కావాలి. శవపేటిక ఇమామ్ ముందు ఉంచాలి. ఇమామ్ శవం ఛాతికి అభిముఖంగా ఖిబ్లా వైపునకు తిరిగి నిలబడాలి. తర్వాత 'దేవునికై నేను ఈ జనాజా నమాజ్ చేస్తున్నాను' అని సంకల్పం చేసుకోవాలి. అందరూ ఇదే విధంగా సంకల్పం చేసుకోవాలి. అయితే ఇమామ్, ఇమామ్ హోదాలో సంకల్పం చేస్తే మిగిలిన వారు ఆయన వెనుక నమాజ్ చేసే సంకల్పం చేయాలి.

ఇమామ్ బిగ్గరగా 'అల్లాహు అక్బర్' అని పలికి ఇతర నమాజుల్లో మాదిరిగానే చేతులు కట్టుకోవాలి. ఇప్పుడు ఇమామ్ ఆయన వెనుక ఉండేవారు ఎవరికివారు మౌనంగా 'సనా' పఠించాలి. తర్వాత ఇమామ్ బిగ్గరగా, మిగిలినవారు మెల్లగా అల్లాహు అక్బర్ అనాలి. ఆపై ఎవరికివారు ఇతర నమాజుల్లో మాదిరిగా 'దరూద్' పఠించాలి. తర్వాత ఇమామ్ బిగ్గరగా మిగతావాళ్ళు నెమ్మదిగాఅల్లాహు అక్బర్ అని చెప్పి ఈ క్రింది దుఆ చదవాలి.

**"అల్లాహుమ్మగ్ ఫిర్‌లి హయ్యినా, వ మయ్యితినా, వ షాహిదినా, వ గాయిబినా, వ సగీరినా, వ కబీరినా, వ జకరినా, వ ఉన్సానా అల్లాహుమ్మ మన్ అహ్‌యైతహూ మిన్నా ఫ అహ్‌యిహీ అలల్ ఇస్లామ్.వమన్ తవఫ్ఫైతహూ మిన్నా ఫతవప్ఫహూ అలల్ ఈమాన్"**

"దేవా! మాలో బ్రతికి ఉన్నవారిని, చనిపోయినవారిని, ఇక్కడ హాజరయిన వారిని, హాజరు కాని వారిని, పిల్లలను, పెద్దలను, స్త్రీలను, పురుషులను, అందరినీ క్షమించు. దేవా! నీవు మాలో ఎవరినయితే సజీవంగా ఉంచుతున్నావో వారిని ఇస్లాం మార్గాన సజీవంగా ఉంచు; ఎవరినయితే మరణింపజేస్తున్నావో వారిని విశ్వాస స్థితిలో మరణింపజెయ్యి"

ఆ తర్వాత ఇమామ్ బిగ్గరగా, మిగిలిన వారు నెమ్మదిగా అల్లాహు అక్బర్ అని పలికి, అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహ్ అంటూ ముందు

కుడివైపునకు తర్వాత ఎడమ వైపుకు ముఖం తిప్పి సలాం చెప్పాలి. జనాజా నమాజ్‌లో తక్బీర్‌లు తప్ప మిగతావన్నీ ఇమాం, ఇతరులు అంతా ఎవరికివారు వ్యక్తిగతంగా పఠించాలి.

## ఉపవాస వ్రతం

వేకువ ఝామున ఉషోదయానికి పూర్వం మొదలుకొని సాయంత్రం సూర్యాస్తమయం వరకు ఉపవాస సంకల్పంతో, తినటం, త్రాగటం, స్త్రీ పురుష సమాగమం మానేయటాన్ని 'ఉపవాసం' (రోజా) అంటారు.

పూర్తి సంవత్సరంలో నెల రోజులపాటు రమజాన్ మాసంలో ఉపవాసాలుండటం ప్రతి ముస్లిం స్త్రీ పురుషులకు ఫర్జ్‌గా నిర్ణయమయింది, అది ఫర్జ్‌కాదని తిరస్కరించినవాడు 'కాఫిర్' (అవిశ్వాసి) అవుతాడు. అనివార్య పరిస్థితుల్లో తప్ప ఉపవాసాలు వదలినవాడు మహాపరాధి అవుతాడు.

రమజాన్ ఉపవాసాలు పాటించకుండా ఉండటానికి అనుమతించ బడిన వారు కొందరున్నారుః-

1) ఉన్మాదావస్థలో ఉన్నవారు.

2) ఉపవాసం ఉంటే వ్యాధి అధికమయ్యే ప్రమాదమున్న వ్యాధిగ్రస్తులు.

3) ప్రయాణీకులు.

4) ఋతుస్రావం అవుతున్న లేక పురిటి రక్తస్రావం కొనసాగుతున్న స్త్రీలు.

కాని ఇలాంటి పరిస్థితుల్లో ఎన్ని ఉపవాసాలు కోల్పోతారో అన్ని ఉపవాసాలు అనివార్యస్థితి తొలగిన తర్వాత ఇతరదినాల్లో పూర్తి చేసుకోవడం అవసరం.

ఉపవాసం ఉండటానికి సంకల్పం చేసుకోవటం అవసరం. సంకల్పం చేయడమంటే మనస్సులో అనుకోవడమన్నమాట, దాన్ని నోటితో ఉచ్ఛరించినా మంచిదే. రమజాన్ ఉపవాసాలకు సంకల్పం రాత్రికే చేసుకోవాలి.

లేకపోతే, మధ్యాహ్నం వేళకు ముందే చేసుకోవాలి. ఉపవాసం కోసం వేకువజాముకు ముందే ఏదైనా కొంచెం తినటాన్ని 'సహ్రీ' అంటారు. సహ్రీ తినటం పుణ్యప్రదం. ఆకలి లేకపోయినా కొంచెమయినా తినాలి. లేకపోతే కనీసం మంచినీళ్ళయినా త్రాగాలి.

## పరిహారం

ఉపవాసం ఉండి దాన్ని భంగపరచడం మహాపాపం, తెలిసీ ఉపవాసం భంగం చేసినవాడు పరిహారం చెల్లించాలి. ఉపవాసభంగ పరిహారం రెండు నెలలు వరుసగా ఎడతెగకుండా ఉపవాసాలు పాటించడం. మధ్యలో ఏదైనా ఒకరోజు ఉపవాసం వదలినా మళ్ళీ మొదటినుంచి ఉపవాసాలుండటం ప్రారంభించాలి. ఒకవేళ అన్ని రోజులు ఉపవాసాలు ఉండటానికి శక్తిలేనట్లయితే అరవై మంది నిరుపేదలకు రెండు పూటలు కడుపునిండా తిండి పెట్టాలి.

ఉపవాస భంగం చేసినందువల్ల కజా రోజా (ఉపవాసానికి బదులు మరో ఉపవాసం వుండటం) పాటించడం, పరిహారం ఇవ్వటం–రెండూ అవసరమయ్యే పరిస్థితులు కొన్ని వున్నాయి. అవి ఏమనగాః–

1) తెలిసీ ఏదైనా తినటం.

2) తెలిసీ సంభోగం చేయడం.

కొన్ని పరిస్థితుల్లో ఉపవాసం భంగమవుతుంది. దానికి బదులుగా మరో ఉపవాసం ఉండడం అవసరం. అయితే అలాంటి స్థితిలో పరిహారం ఇవ్వనవసరం లేదు. ఆ పరిస్థితులు ఇవిః–

1) బలవంతంగా ఎవరైనా ఏదైనా తినిపించగా అది గొంతులో నుంచి లోనికి పోవటం.

2) ఉపవాసం వున్నట్లు జ్ఞాపకమున్నప్పటికీ పుక్కిలించేటప్పుడు పొరపాటున నీళ్ళు గొంతులోకి పోవటం.

3) రాయి, బొగ్గు, కాగితం, మట్టి వగైరా వంటివి తినదగని వస్తువు ఏదైనా మింగటం.

4) పొరపాటున బాగా తెల్లవారిన తర్వాత సహ్రీ తినటం లేక సూర్యాస్తమయం కాక ముందే ఇఫ్తార్(ఉపవాస విరమణకై ఏదైనా తినటం) చేయటం.

ఒకవేళ ఉపవాసం వున్న విషయం మరచిపోయి ఏదైనా తింటే, త్రాగితే అది కడుపు నిండా అయినప్పటికీ ఉపవాసం మాత్రం భగ్నం కాదు. కాని గుర్తు వచ్చిన తర్వాత ఏదీ తినకూడదు. ఇక ఉపవాసం ఎటూ భగ్నం అయింది కదా అని తలచి తింటే మళ్ళీ ఆ ఉపవాసానికి బదులు మరో ఉపవాసం వుండవలసి వస్తుంది.

## నఫిల్ ఉపవాసం

రమజాన్‌లోనే గాక ఇతర దినాల్లో కూడా ఉపవాసాలు వుంటారు. వీటిని నఫిల్ ఉపవాసాలు అంటారు. నఫిల్ ఉపవాసాలకు ఎంతో పుణ్యం లభిస్తుంది. ఎవరైనా నఫిల్ ఉపవాసం వుండి దాన్ని భంగం చేస్తే దానికి బదులు తిరిగి మరో ఉపవాసం వుండవలసివస్తుంది. నఫిల్ ఉపవాసాలకు పరిహారం లేదు. సంవత్సరంలో ఐదు రోజులున్నాయి, ఆ రోజుల్లో నఫిల్ ఉపవాసాలుండటం కూడా నిషిద్ధమే. అవి :- (1) ఈదుల్ ఫిత్ర్ (2) ఈదుల్ అజ్హా, తర్వాత జిల్‌హజ్ నెల పదకొండు, పన్నెండు, పదమూడవ తేదీలు.

## జకాత్

ధనికులు తమ సంపదలో నుంచి ఒక నిర్ణీత భాగాన్ని ప్రతి యేడూ పేదల కోసం, నిరాధారులకోసం చెల్లించడం విధి, దాన్ని 'జకాత్' అంటారు. జకాత్ ఫర్జ్(విధి) కాదని నిరాకరించినవాడు కాఫిర్ అవుతాడు. ఫర్జ్ అని తెలిసి కూడా దాన్ని చెల్లించనివాడు ఘోరాపరాధి.

## జకాత్ ఎవరిపై విధిగా నిర్ణయించబడింది?

ఎవరి వద్దనయితే నగదు రొఖ్ఖం రూపేణ లేక వ్యాపార సామగ్రి రూపేణ లేక వెండి బంగారం రూపేణ ధనముండి, అది ఏభై రెండున్నర తులాల వెండికి లేక ఏడున్నర తులాల బంగారానికి సమానమైన లేక వాటి కంటే అధిక విలువగలదిగా వున్నట్లయితే అలాంటి వారిపై జకాత్ చెల్లించడం ఫర్జ్ (విధి) అవుతుంది. మొత్తం ధనం నుండి రెండున్నర శాతం ధనాన్ని జకాత్‌గా చెల్లించాలి. పశుసంపద, పొలాలు, తోటల వుత్పత్తిపై కూడా జకాత్ చెల్లించవలసి వుంటుంది. దాని వివరాలను గురించి ఇతర పుస్తకాలలో చూసుకోండి లేక తెలిసినవారినడగండి.

## హజ్

హజ్ దినాలలో కాబాను సందర్శించడం, అరఫాత్ మైదానంలో నిలబడటం గొప్ప ఆరాధన. దాని పేరే 'హజ్'. కాబా వరకు పోయిరావటానికి ప్రయాణ ఖర్చులు భరించుకోగల ప్రతి ముస్లిం వ్యక్తి జీవితంలో కనీసం ఒక సారైనా హజ్ (కాబాయాత్ర) చేయటం ఫర్జ్ (విధి). హజ్ ఫర్జ్ కాదని నిరాకరించినవాడు కాఫిర్ (అవిశ్వాసి) అవుతాడు. రాను పోను ఖర్చులు భరించుకోగల స్తోమత వుండి కూడా కాబా యాత్రకు పోని వ్యక్తి ఘోరమయిన పాపం చేసినవాడవుతాడు.

హజ్ గురించిన ముఖ్య విషయాలు ఇతర పుస్తకాలలో చూసుకోండి, లేకపోతే తెలిసినవారినడగండి.

# సందేశం, ప్రచారం

ప్రవక్తల పరంపరలో అందరికంటే చివరన హజ్రత్ ముహమ్మద్ (సఅసం)ని దేవుడు ప్రవక్తగా నియమించి పంపిన విషయం మీరు చదివే వున్నారు. ఆయన తర్వాత ఇంకా ఏ ప్రవక్త కూడా రాడు. దేవుడు తన దాసుల కోసం తన ధర్మాన్ని ఆయన ద్వారా సంపూర్ణం గావించాడు. ఇక, ప్రళయం వరకు ప్రపంచ మానవులందరూ జీవితం గడపడానికి కావలసిన మార్గం ఇదొక్కటే. ఇందులోనే వారి శ్రేయముంది. మానవుడు తన నిజస్వామిని ప్రసన్నుడిగా చేసుకోగల మార్గం కూడా ఇదే. ఈ మార్గాన్నే అనుసరించి అతడు ఇహలోకంలోను, ఆ తర్వాత పరలోకంలోను నిజమైన సాఫల్యం పొందగలడు.

దైవ దాసులకు దైవ ధర్మాన్ని అందజేసే గురుతర బాధ్యత మొట్టమొదట ప్రవక్తల మీద మోపబడుతుంది. హజ్రత్ ముహమ్మద్(సఅసం)ను కూడా ఈ బాధ్యత అప్పగించే దేవుని తరఫున పంపడం జరిగింది. ఆయన దైవాజ్ఞమేరకు దైవధర్మాన్ని ప్రజలకు అందజేశారు. దైవధర్మాన్ని స్వయంగా ఆయన అనుసరించి చూపారు. ఒక్కొక్క విషయాన్ని విస్పష్టంగా బోధించారు. ఆయన (సఅసం) తరువాత ఈ పనిని చెయ్యవలసింది, ఆయన తెచ్చిన ధర్మాన్ని విశ్వసించి, ఆయన చూపిన మార్గంపై నడచేవారు.

తోటి మానవులకు దైవధర్మాన్ని అందజేయటం ముస్లింల విద్యుక్త ధర్మం, ఒకవేళ ముస్లిములు తమ ఈ విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చకపోతే

దాన్ని గురించి తీర్పు దినాన వారిని ప్రశ్నించడం జరుగుతుంది. దైవ ధర్మాన్ని వ్యాపింపజేయడం, దైవం పంపిన ఆదేశాలను ఆయన దాసులందరికీ అందజేయటం అనే కార్యాన్ని తబ్లీగ్ లేక ప్రచారం అంటారు. దీన్నే ధర్మసేవ అనంటారు. దాన్నే 'దావత్' లేక సందేశం అని అంటారు. అరబీభాషలో ఎవరినయినా ఏదయినా పనికోసం పిలవటాన్ని దావత్ అని అంటారు.

ఈనాడు సందేశం, ప్రచారాలకు సంబంధించిన ఈ విధి నిర్వహణను నెరవేర్చడానికి ప్రతి ముస్లిం చేయవలసిన పనేమిటో తెలుసుకోండి. ఇంకా సాధ్యమైనంత వరకు ఆ పనిని పరిపూర్ణమయిన చిత్తశుద్ధితో చేస్తూ వుండండి.

1. మొట్టమొదట ఈ పనిని చేయాలి. ఎలాంటి పరిస్థితుల్లోనయినా సరే చేసి తీరాలి అని గట్టిగా మీరు నిర్ణయించుకోవాలి. ఏ పని చేయటానికైనా గట్టి సంకల్పం లేకపోతే మనిషి ఆ పనిని నిరంతరం చేస్తూ వుండలేడు, కొద్దిదైనప్పటికీ నిరంతరం చేసే సత్క్రియయే దేవునికి ఇష్టం. ఏపనయితే ఒకప్పుడు చేస్తూ మరొకప్పుడు మానివేస్తారో అది ఎన్నటికీ సత్ఫలితాన్నివ్వదు.

2. ఈ పనిని మొదట మీకు అత్యంత సన్నిహితులయినవారి నుంచి ప్రారంభించండి. మీ మాటకు విలువనిచ్చే మీ కంటే చిన్న వాళ్ళకు ప్రేమతో, వాత్సల్యంతో ధార్మిక విషయాలను బోధించండి. మీ మిత్రులకు, మీతో సమానమయిన వారికి కూడా తెలియజేయండి. వీలయితే నేర్పుగా మీ పెద్దలక్కూడా ఈ విషయాలు వినిపించండి. ఈ విధంగా ధార్మిక విషయాలను ఇతరులకు అందజేయటం వలన ఇతరులు ఎటూ ప్రయోజనం పొందుతారు, పోగా స్వయంగా మీకూ ఇందులో ప్రయోజనం వుంది. మీ జ్ఞానం అభివృద్ధి చెందుతుంది. మంచి విషయాలు మీ హృదయంలో నాటు కుంటాయి. మీరు చెడు విషయాలకు దూరంగా వుండటం మొదలెడతారు.

ఒకరికి మంచి పని చేయమని బోధించి స్వయంగా మీరు దాన్ని చెయ్యకుండా వుండటం అనేది ఎలా సాధ్యం?

3. ఎవరికయితే దైవ సందేశాన్ని అందజేయాలని మీరు నిర్ణయించుకుంటారో ముందు వారి హృదయాలను చూరగొనటానికి ప్రయత్నించండి. అందుకే ప్రజల సేవ చేయటం, వారితో ప్రేమ పూర్వకంగా మెలగటం గొప్ప పుణ్యకార్యాలని దేవుడు తెలియజేశాడు. ఈ సేవ, ప్రేమ పూరిత వైఖరి కోసం ఎవరు ముస్లిములో ఎవరు ముస్లిమేతరులో అని మీరు చూడకూడదు. దైవధర్మం కేవలం ముస్లింల కోసమే కాదు. అదయితే దైవం సృష్టించిన సమస్త మానవుల కోసం వచ్చింది. మీరు దాన్ని ఎవరెవరికి అందజేయగలరో వారందరికీ అందజేయాలి. మానవసానుభూతి అందరికీ వర్తిస్తుంది. ఈ విధంగా మానవ సేవ చేసే కొన్ని విధానాలు ఇక్కడ సూచిస్తున్నాము.

ఎవరైతే మీ పొరుగున ఉంటారో, వారు ముస్లిమ్‌లయినా, ముస్లిమేతరులయినా, మీరు వారితో సత్సంబంధాలు కలిగి ఉండాలి. అప్పుడప్పుడు మీరు వారి వద్దకు వెళ్ళాలి, వారిలో ఎవరయినా జబ్బుపడితే పరామర్శించడానికి వెళ్ళండి. మందులిప్పించటంలో, లేక మరేవిధమయిన పనుల్లోనయినా వారి ఇంటి వారికి వీలయినంతవరకు చేయూత నివ్వండి. బజారుకు వెళ్ళవలసిన పనుంటే ఆ పని చేసి పెట్టండి. మీరు అన్వేషణలో ఉంటే సేవ చేయటానికి మీకు ఎన్నో అవకాశాలు దొరుకుతాయి. ప్రతి మనిషి ఇతర మనిషి సహాయాన్ని కోరుతాడు, అంచేత ఇతరులకు మీ సహాయం ఎప్పుడవసరమవుతుందో తెలుసుకోవడం మీ పని.

మీ పొరుగులో ఎవరైనా నిరుపేదవాడు, నిరాధారుడు ఉండవచ్చు. అతని విషయంలో శ్రద్ధ చూపి సాధ్యమైనంత వరకు సహాయం చేస్తూ

ఉండండి. ఈ విధంగా ప్రేమ, సేవ ద్వారా మీ పెద్దలు, పిన్నలు, బంధు మిత్రుల హృదయాలను చూరగొనండి.

4. అన్నిటికంటే ముందు ప్రజల హృదయాలలో దేవునికి సంబంధించిన సరైన విశ్వాసం జ్ఞానం ఏర్పడేలా చూడాలి. ఆ తర్వాత పరలోక విశ్వాసాన్ని మనసులో నాటాలి. తన ప్రభువు సమక్షంలో నిలబడవలసి ఉందనే భావం లేనంతవరకు మనిషి చెడు మార్గాన్ని వదలిపెట్టి మంచి విషయాల వైపుకు రాలేడు.

ఈ విధంగా మెల్లమెల్లగా విశ్వసించవలసిన సమస్త విషయాలను ప్రజల హృదయాలలో నాటాలి. విశ్వాసం పటిష్టం కానంతవరకు మీరు ఏ పని కోసం కూడా ప్రజలను సమాయత్తపరచలేరు. ఒకవేళ మీ మాట తీసేయలేక ఎవరైనా రెండు రోజులు మీతో సహకరించి ఒక పని చేసినప్పటికీ వారు త్వరలోనే ఆ పనిని వదిలేస్తారు.

5. ప్రజలు ధార్మిక విషయాలు తెలుసుకునేందుకు వారిచేత పుస్తకాలు చదివించండి. లేకపోతే మీరే చదివి వినిపించండి. అర్థమయ్యేలా బోధపరచండి. ఈ పనికై ప్రజలను పిలిచి సమావేశాలు ఏర్పాటు చెయ్యాలి. సమావేశం వీలుపడకపోతే, ఒక్కొక్కరికైనా వినిపించండి. ప్రేమతో, ఆర్ద్రహృదయంతో ఏదైనా ఒక పనిని చేస్తూంటే మార్గం తప్పకుండా సుగమం అవుతుంది.

6. చెడును చెరిపేసి, మంచిని పెంచే పని అందరూ కలసిమెలసి చేయాలి, మీ ఊళ్ళో ఎవరైనా ఈ పని ముందే చేస్తూ ఉంటే వారితో సహకరించండి. ఎవరూ చేయకపోతే మీరొక్కరే చేయండి, ప్రయత్నిస్తే మీతో సహకరించే మిత్రులు దొరక్కపోరు.

7. కొంత మంది మీ మాటలు వినటం ప్రారంభించినప్పుడు, దైవాజ్ఞల్ని పాలించాలన్న ఆసక్తి వారిలో జనిస్తుంది. అప్పుడు మీరు మొదటి

వారిని నమాజ్ కొరకు సిద్ధపరిచేందుకు ప్రయత్నించండి.వారికి నమాజ్ పద్ధతి తెలీకపోతే నేర్పండి. కలిమా తెలియకపోతే అదీ నేర్పండి. నమాజ్, కలిమాలలో ఉన్న అర్థాన్నీ నేర్పండి. ఇలా మెల్లమెల్లగా పని చేస్తూ ఉండండి.

8. ధార్మిక విషయాలు తెలియజేసి, అర్థమయ్యేలా బోధపరచిన తర్వాత కూడా ప్రజలు నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తే మీరు నిస్పృహకు లోను కావద్దు. వారిని గురించి చెడుగా పలకవద్దు. ఇది ప్రశాంత మనస్సుతో చేయవలసిన పని. మీ పని మీరు చేస్తూనే ఉండండి. మీ పనికి తగిన ప్రతిఫలం మీకు దేవుని వద్ద లభిస్తుంది. ప్రజలు మీ మాటలు విని తీరాలన్నదే మీ ధ్యేయం కాకూడదు. ఈ పని నిలకడగా అవుతుంది. ఎవరి దృష్టిలో దైవ ప్రసన్నత, పరలోక సాఫల్యం తప్ప మరొక విషయం ఉండదో వారే ఈ పని చేయగలుగుతారు.

9. ధర్మసేవ చేయాలని నిర్ణయించుకున్నప్పుడు మిమ్మల్ని మీరు బాగా పరిశీలించుకోండి. జాగ్రత్త! మీరు చేసే ఏ పని కూడా దైవాజ్ఞలకు వ్యతిరేకంగా ఉండకూడదు, ఈనాడు దైవ ధర్మం ప్రజల హృదయాలను ఆకట్టుకోలేక పోతుందంటే దానికి ముఖ్యమైన కారణం ముస్లింల జీవితాలు ఇస్లాంను ప్రతిబింబించేవిగా లేకపోవటమే. ఒకవేళ మీ జీవితంలో కూడా ఇలాంటిదేదైనా ఉంటే మీరు చెప్పే మాటలకు విలువ ఉండదు. ఎంత నష్టం కలిగినా, ఎన్ని లాభాలు మీ ముందు ప్రత్యక్షమైనా మీరు మాత్రం ఎన్నటికీ అసత్యం పలకకండి★ ఎవరినీ మోసగించవద్దు. పరోక్షంగా ఇతరుల

---

★ ఈ రోజుల్లో అబద్ధమాడకుండా తప్పించుకోవాలంటే మహా కష్టమయిపోయింది. అసలు విషయం ఏమంటే వారు ఇతరులకు చెప్పరానటువంటి పనులు చేస్తూంటారు. అంచేత ఒక తప్పును కప్పిపుచ్చడానికి పది అబద్ధాలు చెబుతుంటారు. రెండవ విషయం ఏమిటంటే ప్రజలు అత్యాశలకుపోయి చిన్న చిన్న ప్రయోజనాలకోసం కూడా అబద్ధమాడతారు. మీరు అబద్ధానికి

తప్పులెన్నడంలాంటి చెడుకు దూరంగా ఉండండి. లావాదేవీలలో నిజాయితీగా మెలగండి. దైవాజ్ఞలకు విరుద్ధమయిన కార్యకలాపాల్లో పాల్గొనకండి. నమాజ్ క్రమబద్ధంగా చేయండి, వీలయినంతవరకు ఉత్తమమయిన నమాజ్ చేయటానికి ప్రయత్నించండి.

10. ఈనాడు మన సమాజంలో అనేక చెడువిషయాలు దారి చేసుకొని సంప్రదాయాలుగా మారినందువల్ల ప్రజలు వాటిని చెడుగా కూడా భావించడంలేదు. అందుచేత మీరు వాటిని అతి జాగ్రత్తగా వదపోయవలసి ఉంది. అలాంటి విషయాలు మీరు మానుకోవలసి ఉంటుంది. దేవుడు, ఆయన ప్రవక్త (సఅసం) చెడు అని తెలిపిన ప్రతి విషయం, ఎలాంటి సంప్రదాయంగా మారినప్పటికీ మీరు దాన్ని చెడుగానే భావించాలి. అలాంటి విషయాలు కొన్ని ఇక్కడ గమనించండి:

వడ్డీ తీసుకోవడం, ఇవ్వటం, లాటరీ వేయటం, మట్కా, కార్నివాల్ అనే పేర్లతో జూదమాడటం, పజిల్ గళ్ళు నింపటం, సినిమాలు చూడటం, స్త్రీలు పరదా వ్యవస్థను పాటించకుండా తిరగడం, నగ్నస్త్రీల చిత్రాలతో ఇండ్లను అలంకరించుకోవటం, బ్లాక్ మార్కెట్ చేయటం, ప్రభుత్వ ఆస్తిని కాజేయటం, అమ్మకపు పన్ను, ఆదాయం పన్ను ఎగవేయటానికి బూటకపు రిజిష్టర్లు వ్రాయటం, ప్రతి చిన్న విషయానికి నిస్సంకోచంగా అబద్ధమాడటం ప్రమాణాలు చేయటం, టిక్కెట్టులేకుండా ప్రయాణం చేయటం, లంచమివ్వటం - తీసుకోవటం, న్యాయస్థానాలలో అబద్ధసాక్ష్యాలు ఇవ్వటం, పాలు, నెయ్యి మొదలయిన పదార్థాలలో కల్తీ చేయటం వగైరా.

---

దూరంగా ఉండాలని నిశ్చయించుకుంటే మొదట మీ జీవితం మొత్తాన్ని మార్చుకోవలసి ఉంది. మీరు అనేక పనులు మానుకోవలసి వస్తుంది, ఎదురుగా కన్పించే అనేక ప్రయోజనాలను వదలుకోవలసివస్తుంది కూడా.

11. ధర్మం పేరిట ఇస్లాంకు వ్యతిరేకమైన విషయాలెన్నో ముస్లింలలో వ్యాపించి ఉన్నాయి. వాటి విషయంలో కూడా మీరు నిజమేదో తెలుసుకుంటూ, తప్పుడు విషయాలకు ఎల్లప్పుడూ దూరంగా ఉండండి, మానవులను మోసగించటానికే షైతాన్ ధర్మాన్ని నాశనం చేసే పనులు చేయిస్తాడు. అలాంటి విషయాలలో కొన్ని ఇవి:-

1. సమాధుల వద్ద, పీర్ల వద్ద మొక్కుబడులు చేయడం.
2. అల్లాహ్‌ను వదిలేసి ఇతరుల పేరుతో మొక్కుకోవటం. సమాధుల ముందు సజ్దాచెయ్యడం, మొక్కుబడులు చేసుకొని వరాలు కోరుకోవటం.
3. ఉరుసు, తదితర సమావేశాల్లో పాల్గొని నాట్యం చూడటం, పాటలు వినటం.

(4) మరణం, వివాహం, జననం సందర్భాలలో ధర్మ విరుద్ధమయిన ఆచారాలను పాటించటం.

ఇలాంటి విషయాలలో మొదట మీరు బాగా తెలిసిన వారిని ఎవరినైనా అడిగి తెలుసుకోండి, తరువాత మీరు మరెలాంటి ఆచారాలనూ పాటించకండి.

ప్రజలనుండి ఇలాంటి దురాచారాలను మాన్పించటానికి ఎంతో నేర్పు, వివేచన ప్రయోగించవలసి ఉంటుంది. ప్రజలు వారంతటవారే ధర్మవిరుద్ధమైన విషయాలకు దూరంగా ఉండేలా వారి హృయాలలో దైవం, పరలోకం, దైవప్రవక్త (సఅసం) బోధనలకు సంబంధించిన నిజమయిన జ్ఞానాన్ని, విశ్వాసాన్ని జనింపజేయటానికి ప్రయత్నించండి; ముస్లింలలో ఉన్న దురాచారాలనే ముందుగా సంస్కరించాలని కూర్చున్న వారిని ప్రజలు రకరకాల చిక్కుల్లో పడేసి నిజమయిన ధర్మసేవా కార్యాన్ని చేయటానికి వీలు లేకుండా చేస్తారు. ఈ విషయంలో మీరు చాలా జాగ్రత్తగా మసలుకోవలసి

ఉంటుంది. అలాంటి చిన్న చిన్న దురాచారాలను దూరం చేసే చిక్కుపనుల్లో ఎన్నడూ పడకండి ఈనాటి ప్రాపంచిక మౌల్వీలు ఇలాంటి విషయాలలోనే పడి కొట్టుమిట్టాడుతుంటారు. ఆ పని వాళ్ళకే వదలివేయండి. ఒకవేళ ఎవరయినా మిమ్మల్ని అలాంటి విషయాల్లో ఇరికిస్తే మీరు వెంటనే ఆ ప్రసక్తిని ఆపేసి మాట ముందుకు సాగకుండా చూడండి. ధర్మకార్యం చేసేవారి దారిలో అడ్డంకులు వెయ్యటానికి ఈనాడు షైతాన్‌కు దొరికిన మహా అస్త్రం ఇదే. కనుక మీరు దీని విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

**"రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అన్తస్సమీ ఉల్ అలీమ్ వల్‌హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్ వస్సలాతు వస్సలాము అలా రసూలి హిల్‌కరీమ్"**

ప్రభూ! మా సేవలను స్వీకరించు, నీవు అన్నీ వినేవాడవు అన్నీ తెలిసినవాడవు. సకల స్తోత్రాలు నిఖిల జగత్తుకు ప్రభుమయిన అల్లాహ్ కొరకే. గొప్ప దైవప్రవక్త అయిన ముహమ్మద్‌పై శాంతి నెలకొను గాక!